విలేఖరులు కావలెను.

జనశక్తి

సామాజిక స్పృహతో, అవినీతి అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రజాసమస్యలను నిర్భయంగా రాసే వారికి తెలుగుజనశక్తి దిన పత్రిక అవకాశం కల్పిస్తుంది.
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజక వర్గాల వారిగా ఆర్సి ఇన్‌చార్జిలు, మండలాల వారిగా రిపోర్టర్‌లు కావలెను.

సెల్: 6302660543

RNI : TELTEL/2024/89275

తెలుగు జనశక్తి

Published From Adilabad, Hyderabad, Khammam, Karimnagar, MahabubNagar, Medak, Nalgonda, Nizamabad, Rangareddy, Kamareddy, Waranagal

హైదరాబాద్ | మంగళవారం | 10.06.2025 | సంపుటి : 02 | సంచిక : 155 | వెల : 4/-



34 బంతుల్లో 75 పరుగులు చేసిన పృథ్వీ షా

08



02

బెట్టింగ్ యాప్‌కు మరొకరు బలి

సిరిసిల్ల జిల్లాలో యువకుడు ఆత్మహత్య



06

రైల్లో నుంచి జారిపడిన ప్రయాణికులు

ఐదుగురు మృతి

## ట్యాపింగ్ పేర్ల ఎంపిక

# ఎలా జరిగింది?

- సిట్ ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మౌనం
- అధికారులకు చెప్పే ఆధారాలు ధ్వంసం చేసినట్లు వెల్లడి!
- 8 గంటలపాటు విచారణ.. రేపు మళ్లీ రావాలని నోటీసులు



02

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును పోలీసులు ప్రశ్నించారు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. దాదాపు గంటన్నరగా ప్రభాకర్ రావును దర్యాప్తు బృందం విచారణ చేసి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తోంది. విచారణ పక్రియను మొత్తాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ పెట్టారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ విచారణ జరిగింది. పోలీసులు అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు స్పందిస్తున్నారా, ఏ మేరకు సమాధానాలు ఇచ్చారో తెలియాల్సి ఉంది. మొత్తానికి తెలంగాణ పాలిటిక్స్‌ను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్ రావు సిట్ విచారణ ముగిసింది.



## ప్రభాకర్‌రావు స్టేట్‌మెంట్ బయటపెట్టాలి

- ఎందరో కార్యకర్తల ఉసురు పోసుకున్న దుర్మార్గుడు
- జడ్జిలతో సహా ఎందరో ఫోన్లు ట్యాప్ చేసిన నీచుడు
- ప్రభాకర్ రావుకు అమెరికాలో కెసిఆర్ కుటుంబం కౌన్సిలింగ్
- కాంగ్రెస్ పాలనలో ఒక్క అవినీతి కేసు కూడా గట్టెక్కడం లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

03

## ప్రజలే కేంద్రంగా పాలన

- 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి
- ప్రపంచంపైనా బలమైన ముద్ర వేశాం : మోదీ
- జవాబుల్ని దాటవేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా



**ఢిల్లీ:** తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' అనేదే తమ పాలనను నిర్దేశించే మూల సూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మిగతా 3 లో

## శాఖల కేటాయింపుపై

# కసరత్తు

### కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

- శాఖల పునర్వ్యవస్థీకరణ కూడా చేపట్టే అవకాశం
- అసమ్మతి రాగాన్ని అధిష్టానం ముందుంచే యత్నం
- నేడు మల్లికార్జున ఖర్గేతో భేటీ



**హైదరాబాద్, జూన్ 9 :** తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన ముగ్గురు మంత్రులకు శాఖల కేటాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. ఇదే అంశంపై సోమవారం మధ్యాహ్నం దిల్లీకొచ్చిన ఆయన సాయంత్రం ఇక్కడి ఇందిరాభవన్‌లో పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్‌తో సుమారు గంటపాటు చర్చించారు. ఈ సందర్భంగా పాత మంత్రులు చూస్తున్న బాధ్యతలు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న శాఖల జాబితాను ఆయనకు అందించినట్లు తెలిసింది. కొత్తవారికి పూర్తిగా కొత్త శాఖలు కేటాయించాలా... పాత మంత్రులు చూస్తున్న అదనపు శాఖలను వారి నుంచి తొలగించి వీరికివ్వాలా... అన్న విషయమై సమాలోచనలు చేశారు. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రుల చేతుల్లో దాదాపు 29 శాఖలున్నాయి.

మిగతా 2 లో



## కేబినెట్ ఆమోదంతోనే

# కాళేశ్వరం నిర్మాణం

### సిడబ్ల్యూసి, మహారాష్ట్ర అభ్యంతరాలతో మేడిగడ్డకు మార్పు

- తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు..
- అధికారులు, నిపుణులతో చర్చించాకే కార్యాచరణ
- మిషన్ బహిరంగ విచారణలో హరీశ్‌రావు
- ఆధారాలు కూడా సమర్పించానని వెల్లడి

మంత్రివర్గం ఆమోదంతోనే అన్ని బ్యారేజీల నిర్మాణం జరిగిందని , తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత సమస్య వల్లే రీడిజైనింగ్ చేసినట్లు కమిషన్‌కు తెలిపినట్లు హరీష్ రావు చెప్పారు. వాప్కోస్ ద్వారా సర్వే చేయించిన తర్వాతే ప్రాజెక్టు స్థలం మారిందని తెలిపారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీరు తరలించవద్దని మాత్రమే విశ్రాంత ఇంజినీర్లు చెప్పారని హరీష్ రావు తెలిపారు.

**హైదరాబాద్, జూన్ 9 :** ప్రాజెక్టుల పునరాకృతికి అప్పటి సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. పలు ప్రాజెక్టులపై ఉప సంఘం అధ్యయనం చేసి.. నివేదిక ఇచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల నిర్మాణాలు జరిగాయి. ఈ ప్రాజెక్టులో అన్ని పనులకూ మంత్రివర్గ ఆమోదం ఉంది" అని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు కాళేశ్వరం న్యాయవిచారణ కమిషన్ ఎదుట పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతా నిజమే చెబుతానంటూ ప్రమాణం చేసిన హరీశ్ రావు.. పలు జీవోలు, సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర ప్రభుత్వం, ఈఎన్సీ, కమిటీలకు సంబంధించిన లేఖలను కమిషన్‌కు ఆధారాలుగా అందజేశారు. హైదరాబాద్‌లో బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో 42 నిమిషాలపాటు హరీశ్‌రావును జస్టిస్ ఘోష్ విచారించారు.

మిగతా 2 లో



## బస్‌పాస్ ఛార్జీల పెంపు

- ఇకపై జనరల్ నెలవారీ విద్యార్థి పాస్ ధర రూ.600
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో విద్యార్థి పాస్‌లకు అనుమతి
- టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ.10 వసూలు
- టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన

02



## మోదీ11 ఏళ్ల పాలన స్వర్ణయుగం

- ఆర్థిక పునరుద్ధరణ,జాతీయ భద్రతకు పెద్దపీట
- స్వయం సమృద్ధి దిశగా దేశం శీఘ్రంగా పురోగమిస్తోంది
- మోదీ పాలనపై హోంమంత్రి అమిత్ షా వెల్లడి

04



05

ఐఈడీ పేల్చిన మావోయిస్టులు

అదనపు ఎస్పీ మృతి

## జలఅస్త్రం దెబ్బకు పాక్ విలవిల



- సింధు జలాలు ఆగడంతో ఎండుతున్న పంటలు
- ముున్ముందు మరిన్ని కష్టాలు

04



07

## 'డార్క్' మోసాలకు చెక్

డార్క్ పాటర్న్స్‌పై కేంద్రం నజర్

## బాయ్‌ఫ్రెండ్ ప్లాన్..

# సోనమ్ సుపారీ

### హనీమూన్ హత్య కేసులో సంచలన విషయాలు

హనీమూన్‌కు వెళ్లి మేఘాలయలో హత్యకు గురైన కేసులో.. మృతుడి భార్యను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో ఈ కేసు కీలకమలుపు తిరిగింది. కాంట్రాక్ట్ కిల్లర్లకు సుపారీ ఇచ్చి భర్త రాజా రఘువంశీని సోనమ్ చంపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆమెకు రాజ్‌కుశ్వాహా అనే వ్యక్తితో సంబంధం ఉందని, అతడే రఘువంశీ హత్యకు కుట్రపన్నాడని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. సోనమ్ కాకుండా ఈ కేసులో మరో ముగ్గురు విక్కీ ఠాకూర్, ఆకాశ్, ఆనంద్ అరెస్టయ్యారు.

06



# శాఖల కేటాయింపుపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

కీలకమైన మున్సిపల్, హెూం, విద్యా శాఖలను సీఎం తనవద్దే ఉంచుకున్నారు. శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల వద్ద మూడేసి శాఖలున్నాయి. తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని, మంత్రులకు శాఖల కేటాయింపులోనూ అదే ప్రాధాన్యం కొనసాగించాలనే విషయంపైనా వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. మిగిలిన ఖాళీల భర్తీ అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డితోపాటు మరో ఇద్దర్ని క్యాబినెట్‌లోకి తీసుకోవాలని భావించినప్పటికీ సాధ్యంకాకపోవడానికి దారితీసిన అంశాలపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. అసంతృప్త నాయకులతో పార్టీ రాష్ట్ర నాయకత్వం మాట్లాడిన విషయంపైనా రేవంత్‌రెడ్డి... వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటివరకున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి, పాత మంత్రుల శాఖల్లో మార్పులు చేయబోరని, కొత్తవారికి కొత్త శాఖలు కేటాయిస్తారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. హెూం, ప్రాథమిక, ఉన్నత, వైద్య విద్య శాఖలు, పశు సంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి, గనులు, మైనార్టీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, కార్మిక, ఎంఎస్‌ఎంఈ, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖలు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఎవరికీ కేటాయించలేదు. మున్సిపల్ శాఖను కోర్, రూరల్ విభాగాలుగా విభజించారు. ఇందులో కొన్ని కొత్త మంత్రులకు అప్పగించవచ్చని చెబుతున్నారు. అయితే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో చర్చించిన అనంతరం దీనిపై ఒక నిర్ణయానికి రావాలని వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంగళవారం మల్లికార్జునఖర్గేతో సమావేశమయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# బస్‌పాస్ ఛార్జీల పెంపు

- ఇకపై జనరల్ నెలవారీ విద్యార్థి పాస్ ధర రూ.600
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో విద్యార్థి పాస్‌లకు అనుమతి
- టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ.10 వసూలు
- టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన

**హైదరాబాద్:** బస్‌పాస్ ఛార్జీలను సోమవారం నుంచి పెంచినట్లు ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీలను గత మూడేళ్లుగా పెంచలేదని, పెరిగిన ఖర్చుల కారణంగా ఇప్పుడు అన్ని రకాల పాస్‌ల ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ సబర్బన్ ప్రాంతాల్లో సిటీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీన్ని తగ్గించడానికి ఇకపై ఆర్డినరీతోపాటు హైదరాబాద్ నగరంలో నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలోనూ పాస్ ఉన్న విద్యార్థులను అనుమతిస్తామని తెలిపింది. దశాబ్దాలుగా ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీని ఎంతగానో ఆదరిస్తున్నారని ఛార్జీల పెంపును కూడా స్వాగతించాలని ఆర్టీసీ కోరింది. అదేసమయంలో టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీని ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తామంది. టోల్‌ప్లాజా రూట్‌లో వెళితేనే యూజర్ ఛార్జీ ఉంటుందని, ఆ మార్గంలో వెళ్లని బస్సులకు ఇది వర్తించదని స్పష్టంచేసింది. పెంచిన బస్‌పాస్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలు ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో పెద్దఎత్తున బస్‌పాస్ ఛార్జీలు పెంచడం ప్రభుత్వానికి, ఆర్టీసీకి తగదని ఆయన నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్ ప్రయాణమంటూనే, మరోపక్క ఛార్జీలు పెంచిందని ఆయన విమర్శించారు.

# ట్యాపింగ్ పేర్ల ఎంపిక ఎలా జరిగింది?

- సిట్ ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మౌనం
- అధికారులకు చెప్పే ఆధారాలు ధ్వంసం చేసినట్లు వెల్లడి!

**హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ప్రశ్నలకు మౌనం దాల్చారు. సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత సోమవారం ఎట్టకేలకు ఆయన సిట్ ముందుకు వచ్చారు. ఇప్పటి వరకూ దర్యాప్తులో వెల్లడైన ఆధారాలను ముందు పెట్టి మరీ అధికారులు అడిగిన ప్రశ్నలు ఆయనను కొంత కలవరపాటుకు గురిచేసినట్లు, దాంతో వాటికి ఎలాంటి సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆధారాల ధ్వంసానికి సంబంధించి సూటిగా సమాధానం చెప్పిన ఆయన.. ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటైన స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్(ఎస్‌వోటీ) గురించి మాత్రం ఎంత ప్రశ్నించినా జవాబివ్వలేదు. సుదీర్ఘ ప్రయాణం చేసి ఉండటంతో దర్యాప్తు అధికారులు కూడా ఆయనను ఎక్కువ ప్రశ్నలు అడగలేదు. విమానాశ్రయంలో కూడా బాగా ఆలస్యమైందని, సరైన విశ్రాంతి లేదని ప్రభాకర్‌రావు చెప్పడంతో మధ్యమధ్యలో విరామమిస్తూ నిర్దిష్టమైన ప్రశ్నలు మాత్రమే సంధించారు. 11న మరోమారు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు ఇచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయానికి ఉదయం 11 గంటల సమయంలో కుమారుడితో కలిసి వచ్చిన ప్రభాకర్‌రావును అధికారులు 8 గంటలు విచారించారు. రాజకీయ లబ్ధి కోసం అప్పటి భారాస ప్రభుత్వం అడ్డగోలుగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనిలో నిజాలు నిగ్గు తేల్చాలని పట్టుదలతో ఉంది. ఎస్ఐబీ అధిపతి హెూదాలో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, అప్పటి ప్రభుత్వ సూచన మేరకు ఆయన నడుచుకున్నారన్నది అభియోగం. దాంతో ఈ కేసు దర్యాప్తులో ప్రభాకర్‌రావు వాంగ్మూలం కీలకంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలు వాంగ్మూలం ఇచ్చారు. 2023 శాసనసభ ఎన్నికలతోపాటు అంతకు ముందు జరిగిన మునుగోడు ఉపఎన్నికలో ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయాలన్న వివరాలతో ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ఎస్‌వోటీ ఏర్పాటు చేసినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైన సంగతి తెలిసిందే. ఇందులో అనేక మంది రాజకీయ నాయకుల పేర్లు ఉన్నాయి. దాంతో అసలు ఎస్‌వోటీ లక్ష్యం ఏమిటి, దీన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది, ట్యాప్ చేయాల్సిన వారి పేర్లు ఎవరు చెప్పేవారు? అని సిట్ అధికారులు ప్రభాకర్‌రావును సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాని ఆయన దీనికి సమాధానం ఇవ్వలేదు. అయితే ఎస్‌వోటీ ఏర్పాటు చేయలేదని కూడా చెప్పకపోవడం గమనార్హం. ప్రణీత్‌రావు విచ్చలవిడిగా ట్యాపింగ్‌కు పాల్పడుతున్న సంగతి తెలుసా, తెలిస్తే ఎందుకు నివారించలేదు, అసలు ఆయన ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడో మీకు తెలుసా? అని అడిగిన ప్రశ్నలకు కూడా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది.

### ఆధారాల ధ్వంసం విధి నిర్వహణలో భాగమే..

'2023 ఎన్నికల్లో భారాస ఓడిపోగానే ఎస్ఐబీలో ఫోన్ ట్యాపింగ్‌కు వాడిన ఉపకరణాలన్నీ ప్రణీత్‌రావు ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా ఎందుకు స్పందించలేదు, అసలు ఆధారాలు ధ్వంసం చేయమని ఎందుకు ఆదేశాలు ఇచ్చారు' అని అధికారులు ప్రశ్నించారు. ఆయన సమాధానమిస్తూ ఇదంతా తమ విధి నిర్వహణలో భాగమేనని, ఎస్ఐబీలో ఇది క్రమం తప్పకుండా జరుగుతుందని, అప్పుడు కూడా పైఅధికారులతో చెప్పిన తర్వాతే ఆధారాలు ధ్వంసం చేశామని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. దీనివల్ల ఎన్నో ఏళ్ల నుంచి సేకరించి పెట్టుకున్న విలువైన సమాచారం కూడా ధ్వంసమైంది కదా అని అడిగినప్పుడు మాత్రం మళ్లీ మౌనం పాటించారని తెలుస్తోంది. తొలిరోజు విచారణలో వెల్లడించిన అంశాలను నమోదు చేశారు. వాటిని ఆయన చదివి సంతకం చేసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు అంగీకరించారు. డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి కలిసి ప్రభాకర్‌రావును విచారించారు. విచారణ ప్రక్రియను వీడియో తీశారు.

# కేబినేట్ ఆమోదంతోనే కాళేశ్వరం నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

జీవో 655 ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం పాత్ర గురించి కమిషన్ ప్రశ్నించగా.. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు సంబంధించి సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు, అంతర్రాష్ట్ర సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలన్నింటిపైనా అధ్యయనానికి, ప్రాజెక్టుల పునరాకృతికి నన్ను ఛైర్మన్‌గా, అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులు సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. ప్రాణహిత-చేవెళ్లను రెండు భాగాలుగా నిర్మించాలని కమిటీ నివేదిక ఇచ్చింది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



### 148 మీటర్ల స్థాయిలోనే నిర్మించుకోవాలన్న మహారాష్ట్ర

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించడానికి కారణాలేంటన్న ప్రశ్నకు హరీశ్‌రావు సమాధానం ఇస్తూ.. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మహారాష్ట్ర అంగీకరించడం లేదని గుర్తించి 2014 జులై 23న ఆ రాష్ట్రంతో సంప్రదింపులు జరిపాం. ఆ రాష్ట్ర మంత్రి హసన్ ముష్రిఫ్‌తో సమావేశమయ్యాం. ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డికి గతంలో తమ సీఎం పృథ్వీరాజ్ చవాన్ లేఖ రాశారని, తుమ్మిడిహెట్టి సమీపంలో 152 మీటర్ల వద్ద నుంచి నీటిని తీసుకెళ్లేలా ప్రాజెక్టు నిర్మాణానికి తాము అంగీకరించబోమని అందులో పేర్కొన్నారని ఆయన చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టుపై తమ రాష్ట్రంలో ఆందోళనలు ఉన్నాయని, మరో ఐదు నెలల్లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఉన్నాయని.. ఆ తర్వాత చర్చిద్దామని అన్నారు. అనంతరం ఆ రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఏర్పాటైంది. 2015 ఫిబ్రవరి 17న ఆ రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు నేతృత్వంలో అక్కడి రాజ్‌భవన్‌లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. ముంపు పరిహారం ఎంత అడిగితే అంత ఇస్తామని చెప్పారు. గతంలో ఆందోళన చేసిన తామే ఎలా అనుమతులు ఇచ్చేదంటూ ఫడణవీస్ తిరస్కరించారు. 148 మీటర్ల స్థాయిలో నిర్మించుకోవాలని సూచించారు.
2007లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు ప్రారంభమైనా.. ఏడేళ్లపాటు మహారాష్ట్రను ఉమ్మడి ఏపీలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పించలేదు. కేంద్రంలో యూపీఏ, మహారాష్ట్ర, ఏపీలలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా.. హెడ్ వర్క్సుకు అనుమతులు తేలేదు. ఈ క్రమంలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీకి రాష్ట్రం లేఖ రాసింది. తుమ్మిడిహెట్టి వద్ద 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 165 టీఎంసీలు అందుబాటులో ఉండగా... భవిష్యత్తులో ఎగువ రాష్ట్రాలు వినియోగించే వాటా తీసివేస్తే 63 టీఎంసీలే అందుబాటులో ఉంటాయని 2015 ఏప్రిల్ 1న రాష్ట్రానికి సీడబ్ల్యూసీ లేఖ రాసింది. ఎగువన వినియోగించుకుంటే భవిష్యత్తులో తెలంగాణ అవసరాలకు నీళ్లు ఉండవని పేర్కొంది. ప్రాణహిత-చేవెళ్ల ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరందించేందుకు వీలుగా అక్కడ నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ 2008 జులై 12నే లేఖ ద్వారా స్పష్టం చేసింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా నీటి లభ్యత, ఎత్తిపోతలపై మరోమారు సమీక్షించాలని 2015లో ప్రాజెక్టు అథారిటీకి రెండు లేఖలు రాసింది. ఈ ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్లు రాష్ట్ర అవసరాలకు తగినట్లు లేవని, కృత్రిమ రిజర్వాయర్లు అవసరమని సీడబ్ల్యూసీ పేర్కొంది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఎత్తును 148 మీటర్లకు కుదిస్తే... 48 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంటాయని 2016 ఫిబ్రవరి 18న సీడబ్ల్యూసీ మరో లేఖలో పేర్కొంది. మహారాష్ట్ర అభ్యంతరాలు, సీడబ్ల్యూసీ సిఫార్సుల మేరకు నీటిని తీసుకునే ప్రాంతాన్ని మేడిగడ్డకు మార్చాల్సి వచ్చింది. దీనిలో భాగంగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలనే ప్రతిపాదన వచ్చింది. దీనిపై అధ్యయనానికి విశ్రాంత ఇంజినీర్లతో నిపుణుల కమిటీని నాడు కేసీఆర్ ఏర్పాటు చేశారు. ప్రాణహిత, గోదావరి కలిసేచోట మేడిగడ్డ వద్ద 283 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. 2016 జులై 17న వ్యాప్కోస్ లైడార్ సర్వే చేసి.. మూడు బ్యారేజీలు నిర్మించి 160 టీఎంసీలను ఎత్తిపోయవచ్చని పేర్కొంది. మూడు బ్యారేజీల నిర్మాణానికి ప్రాంతాలను సూచిస్తూ రూ.13,593 కోట్లతో నిర్మించవచ్చని సూచించింది. ఈ క్రమంలో పాత ప్రాణహిత-చేవెళ్లలోని ఆరు లింక్‌లను కాళేశ్వరంలోకి ప్రభుత్వం మార్చింది" అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎప్పుడు నిర్ణయం తీసుకున్నారని, బ్యారేజీల నిర్మాణాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందా అని కమిషన్ ప్రశ్నించగా 2015 ఏప్రిల్ 13న వ్యాప్కోస్‌ను సర్వే చేయాలని ప్రభుత్వం కోరగా... 2016 జులై 17న నివేదిక ఇచ్చిందని, ఆ నివేదికకు పరిపాలనపరమైన అనుమతులతోపాటు అన్ని రకాల అనుమతులను మంత్రివర్గం ఇచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### ప్రాజెక్టులను వేగంగా నిర్మించేందుకే కార్పొరేషన్

కాళేశ్వరం కార్పొరేషన్ పాత్ర, అధికారాలు ఏమిటని కమిషన్ ప్రశ్నించింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగిందని, కేసీఆర్ ముందుండి నడిపించారని, రాష్ట్రం ఏర్పాటయ్యాక శరవేగంగా ప్రాజెక్టులు నిర్మించి నీటిని ఇవ్వాలనేది ప్రధానోద్దేశమని హరీశ్‌రావు తెలిపారు. ప్రాజెక్టులకు భారీగా నిధులు అవసరమని గుర్తించి.. రుణాల కోసం కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. మంత్రివర్గ ఆమోదం ఉందని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచే రుణాలు సేకరించామని తెలిపారు. కార్పొరేషన్ రుణాలు, వడ్డీల చెల్లింపులకు సంబంధించి మంత్రివర్గంలో చర్చించారా అన్న ప్రశ్నకు లేదని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే రాబడితోనే రుణాల చెల్లింపులు చేయాలని భావించారా అని ప్రశ్నించగా.. నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించడం ద్వారా వచ్చే రాబడితో రుణాల చెల్లింపులకు వీలుందని, కానీ 2019-21 మధ్య కొవిడ్ వ్యాప్తితో గండి పడిందన్నారు. మెదక్‌లో కోకాకోలా పరిశ్రమకు కూడా నీళ్లు ఇవ్వాలనే ప్రతిపాదన ఉందన్నారు. కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయింపులు, రుణాలకు ప్రభుత్వ గ్యారంటీపై ప్రశ్నలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని, రుణాలకు ప్రభుత్వ గ్యారంటీ ఉందని హరీశ్‌రావు తెలిపారు.

### నీటిపారుదలశాఖకు నిబంధనలు మార్చే అవకాశం

బ్యారేజీల టెండర్లు కుదిరాక కాంట్రాక్ట్ నిబంధనలు మార్చారా అని కమిషన్ ప్రశ్నించగా.. నిర్మాణ ప్రాంతం, పనులకు అనుగుణంగా నిబంధనలను మార్చేందుకు నీటిపారుదలశాఖకు అవకాశం ఉంటుందని, అనివార్య పరిస్థితుల్లో ఈ అంశాలపై సిఫార్సు చేసేందుకు వీలు లేకపోలేదని హరీశ్‌రావు తెలిపారు. బ్యారేజీల స్థలాల మార్పునకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 28 గురించి ప్రశ్నించగా.. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించే బాధ్యతను నిపుణుల కమిటీకి ప్రభుత్వం అప్పగించిందని ఆయన తెలిపారు. మేడిగడ్డ నుంచి మధ్య మానేరుకు నేరుగా నీటిని ఎత్తిపోయడానికి వీలులేదని కమిటీ చెప్పిందని, ఈ మార్గంలో ఎన్టీపీసీ, బొగ్గు గనులు ఉన్నట్లు తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్ని నీళ్లను నిల్వ చేసుకోవచ్చని కమిషన్ ప్రశ్నించగా.. 141 టీఎంసీలని హరీశ్‌రావు సమాధానమిచ్చారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయొద్దన్నది తప్పుడు ప్రచారమేనని పేర్కొన్నారు.

### సాంకేతికపరమైన నిర్ణయంతోనే అన్నారం, సుందిళ్ల స్థలాల మార్పు

బ్యారేజీల్లో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని నింపాలని ఎవరు ఆదేశించారని, ప్రభుత్వం ఏమైనా ఆదేశాలు జారీ చేసిందా అన్న కమిషన్ ప్రశ్నలకు.. ఇది సాంకేతికపరమైన అంశమని, ప్రభుత్వం నుంచి ఎవరూ ఆదేశాలు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. నీటిని నిల్వ చేయాలని ఇంజినీర్లే నిర్ణయించారని ఆయన పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు గుత్తేదారులతో 2016లోనే ఒప్పందం కుదిరాక 2018లో ఫ్లడ్ బ్యాంకులు, వరద కాలువలు నిర్మించాలనుకోవడం ప్రణాళికలోపం కాదా అని కమిషన్ ప్రశ్నించగా.. ఈ పనుల నిర్వహణ బాధ్యత ఇంజినీర్లదని, ప్రభుత్వానిది కాదని ఆయన పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థలాలను మార్చాలని హైపవర్ కమిటీ నిర్ణయించిందా అన్న ప్రశ్నకు.. ఇది సాంకేతికపరమైన అంశమని, రాజకీయ నాయకులకు దీనిపై అవగాహన ఉండదని చెప్పారు. నీటిపారుదల శాఖ, ఇంజినీర్లు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. అన్నారం నుంచి సుందిళ్లకు కాలువ దూరం తగ్గించడానికి, నీటి ఎత్తిపోతల హెడ్‌ను మార్చడానికి సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని మార్చామని.. అదే తీరులో అన్నారం స్థలం కూడా మార్చామని తెలిపారు. దీనికి హైపవర్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకున్నా, వ్యాప్కోస్ సలహా కూడా తీసుకోవాలి కదా అని కమిషన్ ప్రశ్నించగా.. హైపవర్ కమిటీలో వ్యాప్కోస్ సంస్థ ప్రతినిధి కూడా సభ్యులుగా ఉన్నారని, ఆ సంస్థ, హైపవర్ కమిటీ కలసి బ్యారేజీల నిర్మాణ ప్రాంతాల మార్పునకు ఆమోదం తెలిపాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. వ్యాప్కోస్ సూచనల కన్నా ముందే ఈ మార్పులు చేశారా అన్న ప్రశ్నకు.. ఆ సంస్థ నుంచి లేఖ వచ్చాకే మార్పు చేశామని తెలిపారు. బ్యారేజీల స్థలాల మార్పు అనేది కొత్తేమీ కాదని.. గతంలో నాగార్జునసాగర్, శ్రీరామసాగర్, సమ్మక్కసాగర్ బ్యారేజీల స్థలాలను మార్చారని సమాధానమిచ్చారు. బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి గుత్తేదారు సంస్థలకు స్థలం అప్పగింతలో జాప్యం చోటుచేసుకుందా అన్న ప్రశ్నకు తనకు గుర్తున్నంతవరకు పెద్దగా జాప్యం జరగలేదని హరీశ్‌రావు చెప్పారు.

# 'మహాలక్ష్మి'తో నిలదొక్కుకున్న ఆర్టీసీ

- 182 కోట్ల జీరో టికెట్లను వినియోగించుకున్న మహిళలు
- రూ.6,088 కోట్లు జమచేసిన ప్రభుత్వం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**సూర్యాపేట:** ప్రజాప్రభుత్వం వచ్చాక తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ ఆర్థికభారం నుంచి బయటపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి సూర్యాపేట బస్ డిపోలో సోమవారం 45 ఎలక్ట్రిక్ బస్సులను భట్టి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. "రాష్ట్రంలో మహిళలందరూ ఉచిత ప్రయాణం చేసేలా మహాలక్ష్మి పథకం తీసుకొచ్చాం. దీనిద్వారా ఆర్టీసీ ఏమవుతుందోనని చాలా మంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రారంభం నుంచి ఇంతవరకు 182 కోట్ల జీరో టికెట్లను వినియోగించుకున్నారు. ఆ టికెట్లను వాడుకున్న మహిళల తరఫున రాష్ట్ర ప్రభుత్వం రూ.6,088 కోట్లు ఆర్టీసీకి జమచేసింది. దీంతో ఈరోజు ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గడువుతీరిన డీజిల్ బస్సుల్ని పక్కనపెట్టి పెద్దఎత్తున ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళుతున్నాం. హైదరాబాద్ నగరాన్ని ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఓఆర్ఆర్ లోపల 2,800 ఎలక్ట్రిక్ బస్సుల్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. 2027 నాటికి ఈ-బస్సుల సంఖ్య మరింత పెంచుతాం" అని భట్టి పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థలను ముందుకు నడిపిస్తున్నామన్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. "గతంలో అసలు ఆర్టీసీ ఉంటుందా అనే సందేహం ఉండేది. నేడు చాలా అభివృద్ధి చెందింది" అని అన్నారు. అనంతరం మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కొంతదూరం ఈ-బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎస్పీ నరసింహ, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్‌కు మరొకరు బలి

## సిరిసిల్ల జిల్లాలో యువకుడు ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల, జూన్ 9 :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మరణాలు ఆగడం లేదు. బెట్టింగ్ యాప్‌లపై నిషేధమున్నా ఫోన్‌లో రోజుకో 4 కొత్త బెట్టింగ్ యాప్స్ పుట్టుకురావడంతో.. యువకులతో పాటు ఉద్యోగులు వాటి బారినపడుతున్నారు. అదేపనిగా బెట్టింగ్ పెడుతూ.. ఉన్నదంతా పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆస్తులు తాకట్టుపెట్టి, లోన్ యాప్‌లలో అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. అప్పులు, లోన్లు ఇచ్చినోళ్ల వేధింపులు భరించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. తాజాగా మరో యువకుడు బెట్టింగ్ యాప్ భూతానికి బలయ్యాడు. అత్యాశకు బెట్టింగ్ యాపుల్లో పందెలు పెట్టి.. నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె గ్రామానికి చెందిన తుమ్మల వంశీ (25) కరీంనగర్‌లో వీల్ అలైన్మెంట్ మెకానిక్ వర్క్ చేస్తుంటాడు. ఈ క్రమంలో బెట్టింగ్ మోజులో పడిన వంశీ.. రూ.10 లక్షల వరకు అప్పులు చేసి బెట్టింగ్ పెట్టాడు. బెట్టింగ్‌లో లాస్ రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యాడు. ఇక చేసేదేమి లేకపోవడంతో సోమవారం పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని వంశీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చేతికి అందొచ్చిన కొడుకు బెట్టింగ్ భూతానికి బలికావడంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



# చిరుధాన్యాల పరిశోధనలో మైలురాయి

## రూ.250 కోట్లతో 'శ్రేష్ఠత' కేంద్రం శంకుస్థాపనలో శివరాజ్‌సింగ్ వెల్లడి

**హైదరాబాద్:** చిరుధాన్యాలపై పరిశోధన, అభివృద్ధి, ప్రాచుర్యానికి.. రూ.250 కోట్లతో నిర్మించే అంతర్జాతీయ శ్రేష్ఠత కేంద్రం (గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్) కీలక మైలురాయిగా నిలవనుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ కేంద్రం నిర్మాణానికి చౌహాన్ సోమవారం శంకుస్థాపన చేశారు. కేంద్ర సహాయ మంత్రి భగీరథ చౌదరి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐఐఎంఆర్ డైరెక్టర్ తారాసత్యవతి, ఐకార్ డైరెక్టర్ జనరల్ మంగీలాల్‌జాట్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని పెంపొందించేందుకు ఈ కేంద్రం మార్గదర్శకంగా పనిచేస్తుందని చౌహాన్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఈ సంస్థ తలమానికంగా నిలవాలని తుమ్మల ఆకాంక్షించారు.

### కొబ్బరిబోర్డు కార్యాలయాన్ని నెలకొల్పాలి: తుమ్మల

తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని నెలకొల్పాలని, పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని, ఆయిల్‌పామ్ గెలల కనిష్ఠ మద్దతు ధరను టన్నుకు రూ.25,000గా నిర్ణయించాలని తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఉద్యాన విశ్వవిద్యాలయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈమేరకు చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా కొబ్బరిబోర్డు కార్యాలయం ఉండేదని, రాష్ట్ర విభజన తర్వాత దానిని విజయవాడకు తరలించారని వివరించారు. విభజన చట్టం కింద ఏర్పాటైన తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.1823.20 కోట్లు మంజూరు కావాల్సి ఉన్నా ఇప్పటివరకు రూ.135 కోట్లే విడుదలయ్యాయని, మిగిలిన నిధులను విడుదల చేయాలని విన్నవించారు. విశ్వవిద్యాలయం పరిధిలో 5 కొత్త పరిశోధన కేంద్రాలు, ఒక ఉద్యాన ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు రూ.100 కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వ్యవసాయానికి జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి.. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను కోరారు. రాష్ట్రంలో చెరువుల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించాలని అభ్యర్థించారు.

జనశక్తి
జనరల్ న్యూస్
GENERAL NEWS
10.06.2025
మంగళవారం


# ప్రభాకర్‌రావు స్టేట్‌మెంట్ బయటపెట్టాలి

- ఎందరో కార్యకర్తల ఉసురు పోసుకున్న దుర్మార్గుడు
- జడ్జిలతో సహా ఎందరో ఫోన్లు ట్యాప్ చేసిన నీచుడు
- ప్రభాకర్ రావుకు అమెరికాలో కెసిఆర్ కుటుంబం కౌన్సిలింగ్
- కాంగ్రెస్ పాలనలో ఒక్క అవినీతి కేసు కూడా గట్టెక్కడం లేదు
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, జూన్ 9 :** మాజీ ఐపీఎస్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు .. నీచుడు, అతను మామూలోడు కాదు, ఎంతో మంది ఉసురుపోసుకున్నాడని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. పథకం ప్రకారమే ప్రభాకర్ రావు లొంగిపోయి సిట్ విచారణకు హాజరయ్యాడన్నారు. అమెరికాలోనే ప్రభాకర్ రావుకు కేసీఆర్ కుటుంబంతో కౌన్సిలింగ్ తంతు పూర్తయ్యిం దని బండి వ్యాఖ్యానించారు. మాలాంటి అనేక మంది కార్యకర్తల ఉసురుపోసుకున్న వ్యక్తి ప్రభాకర రావు అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ విచారణలో మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను బహిరంగ పర్చాలని బండి సంజయ్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పథకం మేరకే లొంగి పోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సిట్ విచారణలో ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రావుకు కేసీఆర్ కుటుంబంతో అమెరికాలో కౌన్సిలింగ్ పూర్తయిందని అందుకే ఆయన లొంగిపోయారని చెప్పారు. కాంగ్రెస్, భాజపా, భారాస నేతల ఫోన్లు ట్యాప్ చేశారని విమర్శించారు. జడ్జిల ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు ప్రభాకర్‌రావు అన్నారు. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాలి. ఫోన్ ట్యాప్ చేసి ఏం చేశారు? ఆడియోలు ఎవరికి పంపారు? ట్యాపింగ్ ఆడియోలను అడ్డుపెట్టుకొని ఎవరిని బెదిరించారు అన్న విషయాలు బయటకు రావాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. కాంగ్రెస్ వచ్చాక ఒక్క అవినీతి కేసు విచారణ ముందుకు సాగలేదు. ప్రభాకర్‌రావు, సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందేనని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఎందుకంటే సీఎం రేవంత్ రెడ్డిపైనే కాదు...నాతోపాటు- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, జడ్జిల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు ట్యాప్ చేసిన ఘనుడు. ప్రభాకర్ రావు వల్ల అనేక మంది జీవితాలు నాశనమైనయ్. ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయ్. భార్యాభర్తలు మాట్లాడుకున్న సంభాషణలను కూడా ట్యాప్ చేసిన నీచుడు.. ఆయన వల్ల భార్యాభర్తలు ఫోన్లో మాట్లాడుకోలేని దుస్థితిని కల్పించారు.

### ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారు..

ఎవరి ఆదేశం మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్న బండి సంజయ్.. ఫోన్ ట్యాపింగ్ చేశాక వాటిని ఏం చేశారు? ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారు.. ఆ ఆడియోలను అడ్డుపెట్టుకుని ఎవరెవరిని బెదిరించారు? అన్నవి బహిర్గతం కావాలని బండి సంజయ్ అన్నారు. కోర్టు నిబంధనలకు లోబడే ప్రభాకర్ రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని..18 నెలల పాలనలో ఏ ఒక్క అవినీతి కేసులో కూడా విచారణ ముందుకు సాగలేదని బండి విమర్శించారు. ఇకనైనా కోర్టులో గట్టిగా వాదనలు విన్పించాలని, ప్రభాకర్ రావు సహ ఆయన వెనుకున్న సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందేనని బండి సంజయ్ అభిప్రాయ పడ్డారు. ఇలా ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు టాప్ చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్ రావు వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రణీత్‌కు అండగా ఉన్నారంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లి చాలా కాలం అక్కడే ఉండిపోయారు. ఇప్పుడు సుప్రీం ఆదేశాలతో హైదరాబాద్ వచ్చి సిట్ విచారణకు హాజరయ్యారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను సమాచారాన్ని ధ్వంసం చేశానని ప్రణీత్‌రావు వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా, 2018 నుంచే తెలంగాణలో అక్రమ ట్యాపింగ్ దందా మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. కాగా, మాజీ ఐపీఎస్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బంధువే ప్రణీత్ రావు. ప్రణీత్ కెరీర్‌లో అడుగడుగునా ప్రభాకర్ రావు అండగా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రభాకర్ రావు నల్గొండ ఎస్పీగా ఉన్నప్పుడే ప్రణీత్ ప్రొబేషన్ క్లియరెన్స్ అయ్యింది. అలాగే.. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్ కాగానే.. ప్రణీత్‌కు ఎస్ఐబీలో పోస్టింగ్ లభించింది. ఎస్ఐబీలో ఉన్న ఇతర ఇన్‌స్పెక్టర్లను కాదని ప్రణీత్‌ను వెనకేసుకొచ్చారని ప్రభాకర్‌పై ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే నిబంధనలకు విరుద్ధంగా ప్రణీత్‌కు డీఎస్పీగా ప్రమోషన్ ఇప్పించారని కూడా విమర్శలు వచ్చాయి.



## భారాస హయాంలోనే ఏపీకి నీటి అక్రమ తరలింపులు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**మిర్యాలగూడ :** భారాస హయాంలోనే ఏపీకి అక్రమంగా నీటి తరలింపులు జరిగాయని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సోమవారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి పాల్గొన్న ఆయన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు ఏపీకి 725 టీఎంసీల నీటిని తరలించగా..భారాస హయాంలో(2014-2023) ఇది 1,200 టీఎంసీలకు పెరిగిందన్నారు. కృష్ణా జలాల పంపిణీలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 298 టీఎంసీల కేటాయింపునకు నాటి సీఎం కేసీఆర్, నాటి మంత్రి హరీశ్‌రావు లిఖితపూర్వక హామీ ఇచ్చి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. 2014 కంటే ముందు పోతిరెడ్డిపాడు నుంచి రోజుకు 4 టీఎంసీల తరలింపు సామర్థ్యాన్ని భారాస హయాంలో 9.6 టీఎంసీలకు పెంచారన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేశారని త్వరలోనే తాము పూర్తి చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మూడున్నరేళ్లలో 20 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదల సొంతింటి కలను నిజం చేస్తామన్నారు. భూ భారతి చట్టం ద్వారా ఆగస్టు 15 నాటికి భూ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామన్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### యాసంగిలో 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు

ముగిసిన యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో వరి ధాన్యం దిగుబడి, కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరిగాయని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. 8,378 కొనుగోలు కేంద్రాల ద్వారా 72లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 12.33 లక్షల మంది రైతులకు రూ.15,121 కోట్ల చెల్లింపులు జరిపామని వెల్లడించారు. 2023 యాసంగి సీజన్‌తో పోలిస్తే అదనంగా 1,344 కొనుగోలు కేంద్రాల ప్రారంభం, అప్పటికంటే రూ.9,139 కోట్లు అదనంగా రైతులకు చెల్లించామని వివరించారు.

## కౌశిక్ రెడ్డిపై కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్, జూన్ 9 :** భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కమలాపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 188 సెక్షన్‌ను కొట్టేసింది. పోలీసులు నమోదు చేసిన మిగతా సెక్షన్లలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశించింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తనను గెలిపించకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనిపై నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే దీనిపై కమలాపురం పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు.

## మల్‌రెడ్డికి బుజ్జగింపులు

### పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**రంగారెడ్డి, జూన్ 9 :** మంత్రివర్గ విస్తరణలో చోటు- దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సోమవారం మంత్రి శ్రీధర్ బాబు తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గడిచిన పది సంవత్సరాలు పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కార్యకర్తలు, పార్టీని కాపాడిన నేత మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు అని ఆయన ఆవేదనను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఇతర పార్టీ పెద్దలు మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మాట్లాడారని అన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరుత్సహానికి గురి



కాకుడదని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దేవాదాయ శాఖలో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి ఏర్పాటు: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగుల సంక్షేమం నిమిత్తం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో కలిసి సంక్షేమ నిధి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ నిధి ద్వారా దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వారి గ్రాట్యుటీని రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఉద్యోగి బ్యాంకు ఖాతాలో ఏక మొత్తంలో వారి సర్వీసు కాలానికి లోబడి చెల్లిస్తామని వెల్లడించారు. మరణానంతరం చెల్లించే ఎక్స్‌గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం చెల్లించే మొత్తానికి కూడా సంక్షేమ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగులు అకాల మరణం చెందితే అంతిమ సంస్కారాల నిమిత్తం ఇచ్చే మొత్తాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు.

## కెసిఆర్‌తో హరీష్ రావు భేటీ

### కమిషన్ విచారణ అంశాలపై చర్చ

**గజ్వేల్, జూన్ 9 :** ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు భేటీ- అయ్యారు. కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం నేరుగా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంకు వెళ్లిన హరీశ్ రావు.. కేసీఆర్‌ను కలిశారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, హరీష్ రావు ఇచ్చిన సమాధానాలపై కేసీఆర్ ఆరా తీసినట్లు- సమాచారం. ఎల్లుండి కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు కేసీఆర్ హాజరుకానున్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ కూడా హాజరైనట్టు- సమాచారం. మరోవైపు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు సైతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో సమావేశం అయ్యారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ ముందు ఎమ్మెల్యే హరీశ్‌రావు విచారణ ముగిసింది. 40 నిమిషాల పాటు- విచారణ జరగగా.. కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు హరీశ్ రావు సమాధానం ఇచ్చారు. కమిషన్ మొత్తం 20 ప్రశ్నలు అడగ్గా.. ప్రతి దానికి హరీశ్ రావు సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్, డిజైన్ల మార్పుపై ప్రధానంగా కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించినట్లు- తెలుస్తోంది. కమిషన్ ముందు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌ను హరీశ్ రావు చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విచారణలో జూన్ 11న కేసీఆర్ కమిషన్ ముందు హాజరుకానున్నారు. ప్రాజెక్టు ఆరంభం నుంచి తీసుకున్న నిర్ణయాలు, అంచనాలు, అనుబంధ అభివృద్ధి అంశాలపై పూర్తి వివరాలతో సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నట్టు- తెలుస్తోంది.

## మరో దేశంలో అయితే కాళేశ్వరానికి బ్రహ్మరథం

- బద్నాం చేయడమే కాంగ్రెస్, బిజెపిల లక్ష్యం
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 9 :** మరో దేశంలో అయితే కాళేశ్వరానికి బ్రహ్మరథం పట్టేవారని కెటిఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రయోజనాలు ప్రజలకు తెలుసని, కేసీఆర్‌ను బద్నాం చేయడమే భాజపా, కాంగ్రెస్ అజెండా అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌అన్నారు. కాళేశ్వరం అంశంపై ఏర్పాటు- చేసిన సిట్ ఎదుట సోమవారం మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కేటీ-ఆర్ కాళేశ్వరం గురించి మీడియాతో మాట్లాడారు. మరో దేశంలో ఈ ప్రాజెక్టును నిర్మించి ఉంటే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేదని, మన దేశంలో కాంగ్రెస్, భాజపా రాజకీయాలకు పావుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అనేది వ్యక్తిగత నిర్ణయం కాదు. మంత్రివర్గ ఆమోదంతోనే నిర్మాణం చేపట్టాం. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. ఆచరణలో పెట్టే బాధ్యత అధికారులు, యంత్రాంగంపై ఉంటు-ంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదు. కాళేశ్వరం అంశంలో దాచాల్సిందేమీ లేదు. అసత్య ఆరోపణలు చేస్తూ నోటీ-సులతో వేధిస్తున్నారు. కమిషన్ ముందు హరీశ్‌రావు పూర్తి అంశాలు వివరించారు. కేసీఆర్ కొత్తగా చెప్పేదేమీ ఉండదు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసే విధ్వంసకర కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నడుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడే వారెవరూ భారాసలో లేరు. మీడియా మేనేజ్‌మెంట్‌తో ప్రధాని మోదీ దృష్టిలో పడేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు.



# మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఉదారత

### క్యాన్సర్‌తో బాధపడే నిరుపేదలకు ఆర్థిక సాయం

**సంగారెడ్డి, జూన్ 9 :** తన నియోజకవర్గంలో క్యాన్సర్‌తో బాధపడే నిరుపేదలకు ట్రీట్‌మెంట్ కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నానని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ లక్షల రూపాయలతో కూడుకున్న వ్యవహారం కావడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ పేషెంట్‌లు బతకడం లేదని, ట్రీ-ట్‌మెంట్ కోసం అప్పులు చేసిన ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో తాను ఎంతో మందికి సహాయం చేశానని, రాష్ట్రంలోని దాతలు కూడా సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఇలా మీడియా ముందుకు వచ్చానని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని సోమేశ్వర వాడకు చెందిన రాణికి బ్రెస్ట్ క్యాన్సర్ రాగా.. ఈరోజు ఆమెను జగ్గారెడ్డి పరామర్శించారు. ట్రీ-ట్‌మెంట్ కోసం నాలుగు లక్షలు రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 'రాణికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. ట్రీ-ట్‌మెంట్ కోసం ఆర్థిక సహాయం నాలుగు లక్షలు అందించాను. స్పెసిఫిక్‌గా మీడియా ముందుకు రావడానికి ఓ కారణం ఉంది. క్యాన్సర్ ఎవ్వరికీ రావొద్దు. క్యాన్సర్ బాధితులది -టె-న్షన్‌లతో కూడిన జీవితం. క్యాన్సర్ ట్రీ-ట్‌మెంట్ లక్షల రూపాయలతో కూడుకున్న వ్యవహారం కావడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు. లక్షల రూపాయల ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో బతకడం లేదు. పేషెంట్ ట్రీ-ట్‌మెంట్ కోసం అప్పులు చేసిన ఆ కుటు-ంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు' అని అన్నారు. నా నియోజకవర్గానికి చెందిన ఆర్థిక స్థోమత లేని పేద క్యాన్సర్ పేషెంట్‌లకు ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నా. మొన్న సదాశివపేటలో క్యాన్సర్ పేషెంట్‌కు 10 లక్షల రూపాయలు, ఈరోజు సంగారెడ్డి పట్టణానికి చెందిన క్యాన్సర్ పేషెంట్‌కు 4 లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందించాను. నా వద్దకు ఆరోగ్య సమస్యల ట్రీ-ట్‌మెంట్ కోసం సహాయం కావాలని ఎంతో మంది వస్తారు. వారికి నా ద్వారా సహాయం అందుతుంది. కానీ.. ఎన్నడూ మీడియాలో రాదు, అది నాకిష్టం ఉండదు. ఇలా మీడియా ముందుకు రావడానికి ప్రధాన కారణం.. రాష్ట్రంలో ఎంతో మంది దాతలు ఉన్నారు, క్యాన్సర్ పేషెంట్‌లకు వారి ద్వారా సహాయం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో మీడియా ముఖంగా అందించడం జరిగింది' అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

## సోలార్ ప్లాంట్లు, పెట్రోలు బంక్‌లు అక్టోబరు 2న ప్రారంభించాలి

### - కలెక్టర్లకు మంత్రి సీతక్క ఆదేశం



**హైదరాబాద్:** రాష్ట్రంలోని మహిళా స్వయంసహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల)కు కేటాయించిన సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులను వచ్చే అక్టోబరు 2న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22 జిల్లాల్లో చేపట్టిన ఇందిరా మహిళాశక్తి భవనాల నిర్మాణం నవంబరులోగా పూర్తిచేయాలన్నారు. సోమవారం సచివాలయం నుంచి ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో దివ్యాదేవరాజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ఇందిరా మహిళాశక్తి ప్రతిష్ఠాత్మక పథకం. కోటి మంది మహిళలను కోటీశ్వరులనుచేసే లక్ష్యంతో కలెక్టర్లు పనిచేయాలి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని ఇందిరా మహిళాశక్తి భవనాలను పూర్తిచేయాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యునిఫాంలను మహిళా సంఘాలచే కుట్టిస్తున్నాం. బడులు తెరిచే రోజున విద్యార్థులందరికీ వాటిని పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలు ఈ నెల 11న తెరుచుకోనున్నాయి. అప్పటికి కలెక్టర్లంతా వాటిని పరిశీలించాలి. కొత్తగా వెయ్యి అంగన్‌వాడీ భవనాలు నిర్మించబోతున్నాం. వాటికి స్థలాలను సేకరించాలి. అర్హులైన మహిళలంతా ఎస్‌హెచ్‌జీల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి. దివ్యాంగులకు ధ్రువీకరణపత్రాలు అందజేసేందుకు 38 ఆసుపత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాం. సకాలంలో వారికి అవి అందేలా చర్యలు తీసుకోవాలి. బాలభరోసా పేరుతో కొత్త స్కీంను తీసుకొస్తున్నాం. ఐదేళ్లలోపు చిన్నారులకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేయిస్తాం. ఏవైనా శస్త్రచికిత్సలు అవసరమైతే ఉచితంగా చేయిస్తాం" అని మంత్రి తెలిపారు.

## ప్రజలే కేంద్రంగా పాలన

(మొదటిపేజీ తరువాయి)



ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు. మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపా-ఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరి స్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో మార్పు గానీ, జవాబుదారీతనం గానీ లేవని, కేవలం ప్రచారమే జరుగుతోందని విమర్శించారు.

## తార్నాక హోటల్‌లో తనిఖీలు

### కుళ్లిన చికెన్‌తో బిర్యానీ

**హైదరాబాద్, జూన్ 9 :** హైదరాబాద్ నగరంలో కల్తీ,నాణ్యత లేని ఫుడ్‌తో హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు సామాన్యుల ప్రాణాలు తీస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బయట ఫుడ్ తినాలంటేనే భయపడేలా చేస్తున్నారు. ఇష్టారీతిన హోటల్స్ నడుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా తార్నాకలోని డెక్కన్ పామ్ రెస్టారెంట్ లో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. కుళ్లిపోయిన చికెన్ తో బిర్యానీ చేస్తున్నట్లు- గుర్తించారు. అలాగే ఎక్స్ పైరీ డేట్ అయిపోయిన ఫుడ్ ఇంగ్రీడియంట్స్ వాడుతున్నట్లు గుర్తించారు. రెస్టారెంట్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు డిప్యూటీ- మేయర్ శ్రీలత. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని హోటల్స్, రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంపాదకీయం

# స్కూళ్లు తెరిచే వేళ.. నిర్లక్ష్యం వీడాలి!




మరో రెండు రోజుల్లో పాఠశాలలు తెరవబోతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం ఎప్పటి లాగేనే ఇప్పటికే ఫీజులు వసూలు చేసేసుకున్నాయి. లక్షల్లో ఫీజులలో విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. తల్లిదండ్రులు ఆందోలనలు గాలిలో కలిసి పోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకుల ప్రైవేట్ ఫీజుల దోపిడీని కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా.. ఆచరణలో మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. ఫీజుల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. కార్పోరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. బిఆర్ఎస్ హయాంలో తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్కలేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రభుత్వాలు మారి రేవంత్ రెడ్డి, చంద్రబాబులు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఎపిలో టెన్త్ మూల్యాంకనంలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. దీనిని బయటకు పెద్దగా పొక్కకుండా మేనేజ్ చేశారు. ఇలా విద్ఆయరంగంలో అవతకవలు మొదలు, ఫీజుల మోత, సౌకర్యాల విషయంలో ప్రభుత్వాలు పెద్దగా దృష్టి సారించడం లేదు. ఇకపోతే పరీక్షల్లో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై హైదరాబాద్‌లో ఏటా తల్లిదండ్రులు ఆందోళన చేసిన ఫలితం కానరాలేదు. ఏటా ఇది జరుగుతూనే ఉంది. అయినా ఫీజుల దోపిడీ పెరగుతోందే తప్ప ఆగడం లేదు. లెక్కాపత్రం లేకుండా వసూలు చేస్తున్న మొత్తాలతో మధ్యతరగతి ప్రజలు కుదేలవు తున్నారు.

నిజానికి తెలంగాణలో కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని ఆనటి సిఎం కెసిఆర్ పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యా విధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇలా కబుర్లు చెప్పి,ప్రజలను నమమించి బురిడీ కొట్టించారు. నిజానికి కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. స్కూళ్లను ఇంటిగ్రేడ్ చేస్తామని, కులరహిత హాస్టళ్లు తొలగిస్తామని చెప్పినా..కార్యరూపం దాల్చడం లేదు. కొత్తగా గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, కులాలా వారీగా అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల విద్యారంతంలో సంస్కరణలు అటకెక్కించారనే భావించాలి. ఎపిలో సర్కార్ స్కూళ్లను బాగుచేస్‌ఆమని, విద్యాదీవెనతతో కిట్లు ఇస్తున్నామని చెప్పారు. ఇకపోతే హైదరాబాద్, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థు లకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్సహించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. క్రీడలకు సరైన ప్రోత్సహకాలులేక ఎంతోమంది భావిక్రీడాకారులు మట్టిలో మాణిక్యాల వలే మిగిలిపోయారు.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అందుకే అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు కల్పించాలి. దాని వల్లనే కార్పోరేట్ విద్యాసంస్థల పెత్తనాన్ని అడ్డుకోవచ్చు. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం ద్వారా భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే గలిగేలా చేయాలి. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాల కారణంగా క్రీడారంగం వెనకబడింది. విద్యాసంస్థలు సైతం వీటిని ప్రోత్సహిం చడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధంగా చూడాలి. ఈ క్రమంలో పాఠశాలలను బలోపేతం చేసి, ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టేలా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రైవేట్ పెత్తనం పోగలదు. విద్యారంగం పురోగతికి ఇదే తక్షణ అవసరమని ప్రభుత్వాలు గుర్తించాలి.

# గాజా వెళ్తుండగా..

## ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ కిడ్నాప్..?



**ఇజ్రాయెల్ : మానవతా** సాయంతో గాజాకు బయల్దేరిన పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌ను ఇజ్రాయెల్ దళాలు అడ్డుకున్నాయి. ఆమెతో పాటు మరికొందరు హక్కుల కార్యకర్తలు ప్రయాణిస్తున్న నౌకను ఐడీఎఫ్ కమాండోలు చుట్టుముట్టారు. తమను ఇజ్రాయెల్ దళాలు కిడ్నాప్ చేశాయంటూ గ్రెటా థన్‌బర్గ్ ఆరోపించారు. ఈమేరకు ఇన్‌స్టాలో ఓ వీడియో విడుదల చేశారు. ఫ్రీడం ఫ్లోటిల్లా సభ్యులతో కలిసి గాజా వెళ్తుండగా తమను అడ్డుకొని బంధించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజం తమకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్రిటిష్ జెండాతో ఉన్న ఈ నౌక పేరు మద్లీన్. పాలస్తీనా అనుకూల ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయలేషన్ అనే సంస్థ చేపట్టిన మిషన్‌లో భాగంగా దీన్ని నిర్వహిస్తోంది. ఈ నౌకలో గ్రెటా థన్‌బర్గ్, మెంబర్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంట్ రీమా హసన్‌తో పాటు మొత్తం 12 మంది ఉన్నారు. వీరంతా గాజా పౌరుల కోసం ఆహారం, బేబీ ఫార్ములా తీసుకుని జూన్ 6న సిసిలీ ప్రాంతం నుంచి బయల్దేరారు. ఈ సాయంత్రానికి గాజా స్ట్రిప్ చేరుకోవాల్సి ఉండగా.. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ ఆర్మీ అంత్జాతీయ జలాల్లో వీరిని అడ్డుకుంది. అనంతరం నౌకను ఇజ్రాయెల్ పోర్టుకు మళ్లించాయి. అయితే, గాజా నలువైపులా ఆంక్షలు ఉండటంతో వీరి నౌకను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. దీనిపై ఇజ్రాయెల్ విదేశీ మంత్రిత్వ శాఖ స్పందించింది. అది మానవతా సాయం అందించడం కోసం వస్తోన్న నౌక కాదని, కేవలం సెలబ్రిటీల 'సెల్ఫీ' యాత్ర అని ఆరోపించింది. అందులో ఆహార పదార్థాలు కూడా చాలా తక్కువ మొత్తంలోనే ఉన్నాయని పేర్కొంది.

## మంత్రికే లంచం ఇవ్వజూపి..

### పోలీసుల కస్టడీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**జైపూర్:** మంత్రికే లంచం ఇవ్వడానికి ప్రయత్నించి.. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇరకాటంలో పడిన ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాజస్థా న్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ తన నివాసానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాఠ్యాంశాల కమిటీలో తనకు చోటు కల్పించాలని కోరుతూ చంద్రకాంత్ వైష్ణవ్ అనే ప్రభుత్వ ఉపాధ్యా యుడు కూడా లిఖితపూర్వక అభ్యర్థనతో అక్కడికి వచ్చారు. అయితే మంత్రికి అభ్యర్థన పత్రాన్ని ఇస్తున్న సమయంలో ఓ స్వీట్ డబ్బాతో పాటు రూ.5 వేలు ఉన్న కవరును అందజేశాడు. కవరులో డబ్బు ఉన్నట్లు గమనించిన మంత్రి వెం టనే పోలీసులకు ఫిర్యాదు చేయడం తో వారు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నారు. అతడు ప్రస్తుతం బన్స్ వారా జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్-3 ఉపాధ్యాయు డిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తనకు అర్జీలు ఇస్తున్న విధంగానే ఉపాధ్యాయుడు కూడా వినతి పత్రం ఇచ్చాడని తాను భావించానని మంత్రి పేర్కొన్నారు. అనంతరం అందులో డబ్బు ఉన్నట్లు తన సిబ్బంది గుర్తించడంతో అతడిని అక్కడే ఉండమని చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు. దరఖాస్తులో ఉపాధ్యాయుడు తాను విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, సంఘ్ పరివార్‌తో సంబంధం కలిగి ఉన్నానని..దానిని కూడా పరిగణలోకి తీసుకోవాలని రాసినట్లు తెలిపారు. రాజస్థాన్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్‌తో అనుసంధా నమై ఉన్న పాఠ్యాంశాల కమిటీలో స్థానం సంపాదించాలనే ఆశయంతో తాను మంత్రిని కలిసినట్లు ఆ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

### వర్తమానాన్ని వదిలేసి..

## 2047 గురించి కలలా?

### : రాహుల్ విమర్శలు

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ఎలాంటి జవాబుదారీతనం లేకుండా కేవలం ప్రచారం మాత్రమే కొనసాగిస్తోం దని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. వంర్తమానం గురించి మాట్లాడ టం మా నేసి.. 2047 గురించి కలలు కంటోందని ధ్వజమెత్తారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందిం చారు. మోదీ సర్కార్ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సమయంలో.. ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తోందన్నారు. రైలు నుంచి కింద పడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. భారతీయ రైల్వేలను కోట్లాది మంది ప్రజల జీవితాలకు వెన్నెముకగా అభివర్ణించిన రాహుల్ గాంధీ.. కానీ, ఆ సంస్థ ఈ రోజు అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని ఆరోపిం చారు. నరేంద్ర మోదీ పాలనలో జవాబుదారీతనం లేదు.. మార్పు లేదు.. కేవలం ప్రచారమే ఉందని విమర్శించారు.

### 11 ఏళ్ల మోదీ పాలన..

## ప్రజాసేవలకు స్వర్ణయుగం : అమిత్ షా



**ఢిల్లీ:** ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టి సోమవారానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా మోదీ పాలనపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనను.. ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకితభావంతో కూడిన 'స్వర్ణయుగం'గా అభివర్ణించారు. మోదీ మూడో హయాంలో మనదేశం స్వావలంబన వైపు వేగంగా పరుగులు తీస్తుందన్నారు. "దేశ ప్రజల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి.. భారత్‌ను ప్రతి రంగంలోనూ నంబర్ వన్‌గా మార్చేందుకు ఈ ప్రయాణం కొనసాగుతోంది. ఆర్థిక పునరుద్ధరణ, సామాజిక న్యాయం, సాంస్కృతిక గౌరవం, జాతీయ భద్రతతో కొత్త శకాన్ని దేశం చూస్తోంది. బలమైన నాయకత్వం, దృఢమైన సంకల్పం, ప్రజాసేవ పట్ల తపన ఉంటే.. సుస్థిర పాలనను అందించొచ్చని మోదీ ప్రభుత్వం నిరూపించింది" అని అమిత్ షా కొనియాడారు. 2014లో మోదీ ప్రధాని బాధ్యతలు చేపట్టేనాటికి కేంద్ర ప్రభుత్వంలో ఎన్నో విధానపరమైన లోపాలు ఉన్నాయని అమిత్ షా గుర్తుచేశారు. కుంభకోణాలు తారస్థాయికి చేరాయని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని అప్పటి యూపీఏ సర్కారును విమర్శించారు. అస్తవ్యస్తమైన వ్యవస్థలను మోదీ సర్కారు గాడిలో పెట్టిందని అన్నారు. 11 ఏళ్ల ఆయన పాలనలో దేశాభివృద్ధి వేగంగా పయనిస్తోందని అన్నారు. రైతులు, మహిళలు, దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని కేంద్రమంత్రి తెలిపారు. బుజ్జగింపు రాజకీయాలకు బదులు.. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నారని అన్నారు.

## నా కుమారుడితో గొడవలో ట్రంప్‌దే గెలుపు

### ఎరాల్ మస్క్



**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య విభేదాలు తీవ్రంగా మారిన సంగతి తెలిసిం దే. వీరిద్దరూ బహిరంగంగానే పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుం టున్నారు. దీనిపై తాజాగా మస్క్ తండ్రి ఎరాల్ మస్క్ స్పందించా రు. గత కొన్ని నెలలుగా పరిపాలనకు సంబంధించిన విషయాల్లో మస్క్, ట్రంప్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ట్రంప్ తీసుకువచ్చిన బిల్లు నేపథ్యంలో మస్క్ తీవ్ర అసహనానికి గురయ్యాడని.. అందుకే అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయంలోనే వారిద్దరి మధ్య గొడవ వచ్చిందని పేర్కొన్నారు. అందమైన భారీ బిల్లును ట్రంప్ తీసుకురావడాన్ని మస్క్ వ్యతిరేకించారని ఎరాల్ అన్నారు. కాంగ్రెస్, సెనెట్‌లలో ఓట్లు పొందాలంటే ట్రంప్ అటువంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనే విషయాన్ని మస్క్ అర్థం చేసుకోవట్లేదని పేర్కొన్నారు. ట్రంప్ దేశానికి అధ్యక్ష స్థానంలో ఉన్నాడు కాబట్టి ఈ వివాదంలో తన కుమారుడిపై ఆయనే గెలిచే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటిక యినా ఇరువురు వివాదాలను పక్కనపెట్టి కలిసి పని చేయాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మే నెలలో అమెరికా ప్రభుత్వం తీసుకొ చ్చిన రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌తో దూరం పెరిగింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి తానే కారణమని మస్క్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తోసిపుచ్చారు. తానెవరి సాయం లేకుండా నెగ్గానని సమాధానమిచ్చారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ(డోజ్) నుంచి తప్పించినందుకే మస్క్‌కు అంత ఆక్రోశమని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇదే సమయంలో టెస్లా అధినేత కూడా సంచలన ఆరోపణలు చేశారు. లైంగిక వేధింపుల నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టైన్ కేసులో ట్రంప్ పాత్ర ఉందని, అందుకే ఆ కేసు దస్త్రాలను పూర్తిస్థాయిలో ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు.



## సిఐటియు మండల సదస్సును విజయవంతం చేయండి

### సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్

**మహబూబాబాద్ జిల్లా తెలుగు జనశక్తి తొర్రూరు జూన్ 09 :** జూన్ 13న సిఐటియు తొర్రూరు మండల సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు తొర్రూర్ మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పట్టణ కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. సిఐటియు తొర్రూరు మండలం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా సహకరించాలని అదేవిధంగా సభ్యులందరూ బాధ్యతగా సదస్సు లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, జిల్లా కమిటీ సభ్యులు దుండి వీరన్న లు హాజరవుతారని మండల కమిటీ సభ్యులు అభిమానులు తదితరులు విధిగా భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.



## కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ను ఇద్దరికీ గాయాలు

**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి జూన్ 9 :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోనిగుడిమేటి శివారులో కారు సోమవారం సాయంత్రం అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ను ఢీకొట్టడం జరిగింది దీంట్లో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయాలు కాగా వెంటనే హుటాహుటిన అంబులెన్స్ కు ఫోన్ చేయగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించడం జరిగింది.



## కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకపోతున్నారు

- బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇంటి నిర్మాణాన్ని చేపట్టిన దాఖలాలు లేవు
- ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి గృహ నివాసం ఏర్పాటు

**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రతినిధి (తెలుగు జనశక్తి) జూన్ 09 :** ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లకు మహర్దశ ప్రజా నాయకుడు ఆది శ్రీనివాస్ పై విమర్శలు చేస్తే సహించేది లేదు సుభాష్ నగర్ లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో న్యాత నవీన్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నటువంటి అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని యూత్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు న్యాత నవీన్ విమర్శించారు. సోమవారం వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో స్థానిక పట్టణ నాయకులతో కలిసి అయన పాల్గొని మాట్లాడారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్ల బృహత్కరమైన కార్యక్రమానికి మహర్దశ లభించనుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఏ ఒక్క పేదవాడికి ఒక్క ఇంటి నిర్మాణాన్ని కట్టించిన దాఖలాలు లేవని అన్నారు. ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలతో ఆది శ్రీనివాస్ ప్రభాల్యం ప్రజలలో పెరిగిందని, దీనిని స్థానిక బిఆర్ఎస్ పార్టీ నేతలు జిర్ణించుకోలేకనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ప్రజా నాయకుడు ఆది శ్రీనివాస్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించి మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాగరం వెంకటస్వామి, నాగుల విష్ణు ప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ నాగ మురళి, వేములవాడ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ ఎన్నారం సాగర్, టౌన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, షేక్ ఇర్ఫాన్, ప్రదీప్, మ్యాదరి జాన్, భాను తదితరులు పాల్గొన్నారు.



## ప్రసన్న వెంకటేశ్వర స్వామి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**కూకట్పల్లి, తెలుగు జనశక్తి, జూన్ 9 :** కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోతీ నగర్ పాండురంగ నగర్లో ప్రసన్న వెంకటేశ్వర 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంత్ నగర్ లో రేణుక ఎల్లమ్మ , పోచమ్మ యంత్ర విగ్రహ ప్రతిష్ట నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కే నరేష్, నాయకులు లక్ష్మయ్య, సుధాకర్ , సాత్విక్ ,శివ చౌదరి, గోవిందు ,రమణ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర నూతన మంత్రివర్యులకు శుభాకాంక్షలు

**కూకట్పల్లి, తెలుగు జనశక్తి, జూన్ 9 :** కూకట్పల్లి నియోజకవర్గం,హోతెలంగాణ రాష్ట్ర నూతన మంత్రివర్యులు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని శాలువాతో సన్మానిస్తున్న వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాషిపాక యాదగిరి కూకట్పల్లి డివిజన్ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్ కూకట్పల్లి నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే సంజీవరావు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి బొల్లం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



## దోమల ముందు స్ప్రే

**చర్ల జూన్ 09 తెలుగు జనశక్తి :** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని హాస్టల్లో దోమల మందు సోమవారం స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ చర్ల దగ్గర ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ వర్షాకాలం దోమలు అధికముగా వచ్చే ప్రమాదం ఉన్నదని, దోమలు మనలను కుట్ట కుండ జాగర్తలు తీసుకోవాలని, విద్యార్థులు జ్వరం వచ్చినట్లయితే వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లాలని, అక్కడ మంచి వైద్యం అందుతుందని తెలియజేశారు. హాస్టల్ చుట్టూ ప్రక్కలా నీరు నిలవకుండా జాగ్రత్తలు చూసుకోవాలని, పిచ్చి మొక్కలు చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ హనుమంతు, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రామకృష్ణ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, హెల్త్ అసిస్టెంట్ ధర్మా రావు, నరసింహారావు, స్వరూప, ఆశా కార్యకర్తలు రంగమ్మ, కృష్ణవేణి, ఉషారాణి పాల్గొన్నారు.



## ఈవీఎం, వీవీప్యాట్ వేర్హౌస్‌ను తనిఖీ చేసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలుగు జనశక్తి జూన్ 9 :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్), వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ (ట్రయల్) వేర్హౌస్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతం కూడా పాల్గొన్నారు. తనిఖీ సందర్భంగా, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారి మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వేర్హౌస్ సీల్‌ను తెరిచి, గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం, వీవీప్యాట్‌ల పెట్టెలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సంబంధించిన భద్రతా వివరాలను జిల్లా ఎన్నికల అధికారి సీఈఓకు వివరించారు. తనిఖీ అనంతరం, అన్ని పెట్టెలను మళ్లీ వేర్హౌస్‌లో భద్రపరిచి, వారి సమక్షంలోనే గోడౌన్‌కు తాళం వేసి సీల్ చేశారు. తనిఖీ ప్రారంభంలో జిల్లా ఎన్నికల అధికారి గౌతం పూలమొక్కతో సీఈఓ సుదర్శన్ రెడ్డికి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, శామీర్‌పేట్ ఎంఆర్ఓ యాదగిరి రెడ్డి, అలాగే వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలుగు జనశక్తి జూన్ 9 :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా త్వరగా పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డీఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ 70 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "ఎంతో వ్యయప్రయాసలకోర్చి, త మ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనం దరిపైనా ఉంది," అని అన్నారు. ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, వాటి పరిశీలనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా, తిరస్కరించే దరఖాస్తుల విషయంలో అర్జీదారులకు ఎందుకు తిరస్కరి స్తున్నారనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజే యాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖా స్తు లపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రా వతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జైల్లో పెట్టిన రైతులను విడుదల చేయాలి

### ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య డిమాండ్



**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) జూన్ 9 :** గద్వాల జిల్లా జోగులాంబ మండలంలోని పెద్ద ధన్వాడలో ఇతా నాయిల్ ఫ్యాక్టరీ వల్ల గాలి, నీరు,భూమి కలుషితమై ప్రజల ఆరోగ్యాలను దెబ్బతింటాయని ఫ్యాక్టరీ మాకు వద్దన్నందున ఆ ఫ్యాక్టరీ నిర్మాణం జరప వద్దన్నందున రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులపై కేసులు పెట్టినారు. వెంటనే వారిపై మోపబడిన కేసులను ఉపసంహరించి జైల్లో ఉన్న రైతులను విడుదల చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం ఎన్ఆర్ భవన్ కోటగల్లి లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ ముందుగా ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అమరుడు కామ్రేడ్ నాయక్ వాడి నరసయ్య కు సమావేశము ఘన నివాళులు అర్పించింది. అనంతర%శీ% భూమయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం రైతాంగానికి సరిపడా అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగుమందులు, ఎస్సీ ఎస్టీ రైతులకు ఉచితంగాను మిగతా రైతులకు 50% పై అందించాలని ఆయన అన్నారు.రైతులందరికీ సరిపడ రుణాలు అందించాలి. మార్కెట్లో ప్రైవేట్ విత్తనాల కంపెనీలు, నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నారని ప్రైవేట్ వ్యాపారుల మోసాలకు గురికాకుండా రైతాంగాన్ని కాపాడేందుకు అట్టి వ్యాపారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని భూమయ్య అన్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధికి ప్రభుత్వం ఇవ్వాల్సిన 450 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, ఈ సంస్థ ద్వారానే రైతులకు నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అగు ఎర్రన్న బి.సాయిలు, సహాయ కార్యదర్శి పర్వన్న, నాయకులు పోచన్న, తదితరులు పాల్గొన్నారు.


## మినీ చెత్త డంపింగ్ యార్డ్ని తలపిస్తున్న
# జయశంకర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్



**కూకట్పల్లి, తెలుగు జనశక్తి, జూన్ 9 :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ జయశంకర్ కాలనీ,ఎన్టీఆర్ నగర్ పరిధిలోని ప్రజలను పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. భరించలేని దుర్వాసనతో మురికి కూపంలా తయారైంది. దోమలు దండయాత్రతో జనం అవస్థలు పడుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లు అయినా లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలోని వ్యర్థాలను పారిశుద్ధ్య అధికారులు ఇంతవరకు తొలగించలేదు. దీంతో వర్షం పడినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎన్టీఆర్ నగర్ కాలనీ మజీద్,బెతెల్ గాస్పల్ చర్చ్ దగ్గర బ్లాక్ నెంబర్ 136,143,144,145 వీటి మధ్య ఖాళీ స్థలం పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో నిండిపోయాయి. జిహెచ్ఎంసి అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కడ ఖాళీ స్థలంలోనే చెత్త వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం మినీ చెత్త డంపింగ్ యార్డ్ని తలపిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో కాలనీల్లోని డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రాత్రి అయితే చాలు దోమల బెడదతో కాలనీవాసులు హడలిపోతున్నారు.

## భద్రాది కొత్తగూడెం జిల్లాలోని 5 నియోజకవర్గాల
# రైతాంగానికి సాగునీరు అందించాలి

### తహసిల్దార్‌కి మెమోరండం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**చర్ల జూన్ 9 తెలుగు జనశక్తి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లాకు తరలించుకొని పోవుచున్నారు. ఖమ్మం జిల్లాకు సాగునీరు ఇవ్వడం సరైనదే కానీ భద్రాది కొత్తగూడెం జిల్లాలోని 5 నియోజకవర్గాల రైతాంగానికి సాగునీటి ఇవ్వకపోవడం మాత్రం దుర్మార్గం. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేల్కొని భద్రాద్రి జిల్లాకు సాగునీరు అందించవలసిందిగా రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి, గ్యారెంటీ కార్డుల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు కాకపోగా సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నదని, ఇకనైనా ఈ ప్రభుత్వం మేల్కొని ఆరు గ్యారెంటీలలోని 420 హామీలు తక్షణమే అమలు చేయవలసిందిగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేసింది. 6 గ్యారంటీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ సామాన్య ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందని ప్రభుత్వానికి హెచ్చరిస్తూ మండల తహశీల్దార్ కి మెమొరండం అందజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, మాజీ ఎంపీపీ గీద కోదండ రామయ్య, మండల సీనియర్ నాయకులు సయ్యాద్ అజీజ్, ఎడ్ల రామదాసు, డివిజన్ యువజన నాయకులు కాకి అనిల్, బీసీ సెల్ అధ్యక్షులు గోరంట్ల వేంకటేశ్వర రావు, ఎస్ టీ సెల్ కార్యదర్శి కారం కన్నారావ్, ఎస్ సీ సెల్ అధ్యక్షులు కొంబత్తిని రాము, యూత్ మండల అధ్యక్ష కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పల నిరంజన్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కుప్పల సౌజన్య, యూత్ నాయకులు కట్టాం కన్నారావు, తడికల బుల్లెబయి, మెడబత్తిని గోవర్ధన్, తోటపల్లి సాయి, కోటి శ్రీకాంత్, బట్ట కొమరయ్య, మునిగేలా సాంబ, తడికల చంద్రశేఖర్, గట్టుపల్లి రాజు, కారం రామారావు, గట్టుపల్లీ రామయ్య, మైపా వెంకటేశ్వర్లు తదితర యువజన నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలుగు జనశక్తి జూన్ 9 :** జగద్గిరిగుట్ట (శామీర్‌పేట్)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమ య్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇశ్రత్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కళాశాలలో బీఎస్సీ (బి.జెడ్.సి ,ఎం.జెడ్.సి ,ఎం.స్.డి.ఎస్, ఎం.ఎస్. సి.ఎస్, ఏ.ఐ.ఎం. ఎల్) మరియు బీకాం (కంప్యూటర్స్, బీఏ) కోర్సులు అందు బాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల జూన్ 23, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు పదవ తరగతి మార్కుల మెమో, ఇంటర్ మార్కుల మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇంటర్ టీసీ, 8 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి. ఈ కళాశాల సిద్దిపేట్ హైవేలోని ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్ ఎదురుగా శామీర్‌పేట్‌లో ఉంది. విద్యార్థినులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) జూన్ 9 :** తాళ్ల రామడుగు గ్రామంలో గౌరవనీయులు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సార్ గారి ఆదేశానుసారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాకారం రవి మరియు భాకారం సంతోష్ కుందేళ్ళ శ్రీనివాస్, బండారి నరేష్, చింతపండు పెద్ద గంగారం, అశుభ శశి కిరణ్,ఎంఆర్ఎఫ్ జిల్లా కార్యదర్శి నక్క రాజేందర్ మరియు కాంగ్రెస్ నాయకులు ఆవుల కిష్టారెడ్డి, పెండ్లి రాజేశ్వర్, కోవూరు సాయిలు, ఆవుల నరేష్, కర్కా నర్సన్న, సాయిరి పెద్ద నరసయ్య అందరూ కలిసి కుందేళ్ళ సాయిలు కు 42000 చెక్కు మరియు కుందేళ్ళ నరసయ్యకు 27000 రూపాయల చెక్కు నక్క రాజేశ్వర్ ఆశన్న కు 60000 చెక్కు లు ఇవ్వబడినాయి వీరు మాట్లాడుతూ గౌరవనీయులు భూపతి రెడ్డి సార్ కు మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదములు తెలిపినారు.




## నాగారం మున్సిపాలిటీలో 'విడిఆర్ ఫిల్లింగ్ స్టేషన్' ప్రారంభం

**మేడ్చల్ జిల్లా నాగారం తెలుగు జనశక్తి జూన్ 9 :** నాగారం మున్సిపాలిటీలోని 3వ వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన "వి డి ఆర్ ఫిల్లింగ్ స్టేషన్" (పెట్రోల్ పంప్)ను ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. దయాకర్ రెడ్డి ఆహ్వానంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ప్రారంభోత్సవానికి మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, రాంపల్లి మాజీ సర్పంచ్ అడిగా రాములు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బుద్ధవరం లక్ష్మీ వేణుగోపాల్, ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక ఆకర్షణగా ప్రజలకు ఇంధన సరఫరాలో నాణ్యత, వేగం, మైత్రీపూరిత సేవలందించడమే లక్ష్యంగా ఈ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటైంది.



## కీసర వార్డు కార్యాలయాన్ని తొలగించవద్దని కలెక్టర్‌కు వినతిపత్రం

**మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ తెలుగు జనశక్తి జూన్ 9 :** దమ్మైగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసర వార్డు కార్యాలయాన్ని తొలగించవద్దని కోరుతూ కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్, కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు రాగుల రమేష్ ముదిరాజ్ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో వారు పేర్కొన్న వివరాల ప్రకారం, కీసర ఉమ్మడి గ్రామంలోని కీసరగుట్ట, వన్నీగూడ, కీసర దయారా, కాపు గూడెం ప్రాంతాలు పూర్తిగా దమ్మైగూడ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ప్రస్తుతం కీసర వార్డు కార్యాలయం పాత గ్రామ పంచాయతీ ఆఫీసు నుండే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే, ఇప్పుడు ఈ వార్డు కార్యాలయాన్ని కీసర నుండి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారికి తెలిసిందని తెలిపారు. కీసర గ్రామంలో సుమారు 20 వేల మంది నివసిస్తున్నారని, వీరిలో అధిక సంఖ్యలో పేద ప్రజలు ఉన్నారని, వార్డు కార్యాలయం తరలిస్తే ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని, అధికారులకు దూరం అవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కావున, దమ్మైగూడ మున్సిపాలిటీలోని కీసర వార్డు కార్యాలయాన్ని కీసరలోనే కొనసాగించి ప్రజలకు సులభంగా పాలన అందించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర సాయిలు, గ్రామ నాయకులు పండుగ రాజలింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకం బ్రతికిస్తే మూఢనమ్మకం బలిచేస్తుంది



## అభివృద్ధికి అడ్డుగోడగా అంధవిశ్వాసాలు!

**హైలైట్స్:**

- నమ్మకం, మూఢనమ్మకం మధ్య వ్యత్యాసం: శాస్త్రీయత ఆధారంగా నమ్మకం, అజ్ఞానం ఆధారంగా మూఢనమ్మకం.
- మూఢనమ్మకాలకు మూలాలు: అజ్ఞానం, భయం, సంప్రదాయాల పేరుతో అంధత్వం, అమాయకత్వం.
- వ్యక్తిగత, ఆర్థిక, సామాజిక నష్టాలు: కుటుంబాలు, ఆర్థిక వనరులు, సామాజిక న్యాయంపై తీవ్ర ప్రభావం.
- చదువుకున్న వారిలోనూ మూఢత్వం: జ్ఞాన సమాజానికి పెనుముప్పుగా మారిన ఈ ధోరణి.
- బలైపోతున్న అమాయకులు: క్షుద్ర పూజలు, నరబలులు, బాణామతి పేరుతో హింస.
- నిర్మూలనకు మార్గాలు: విద్య, మీడియా చైతన్యం, కఠిన చట్టాలు, మేధావుల బాధ్యత.

మేడ్చల్ మల్కాజిగిరి, జూన్ 9: మనిషి జీవితంలో నమ్మకం ఒక శక్తివంతమైన సాధనం. అది ఆశను ఇస్తుంది, గమ్యం చూపిస్తుంది, ముందుకు నడిపిస్తుంది. అయితే ఆ నమ్మకం సత్యంపై, శాస్త్రీయతపై, ఆత్మవిశ్వాసంపై ఆధారపడితేనే పురోగతికి తోడ్పడుతుంది. లేదంటే అదే నమ్మకం మూఢనమ్మకంగా మారి వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తుందని సామాజిక విశ్లేషకులు జి. అజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

**భారతదేశం - విజ్ఞాన కేంద్రంలో మూఢత్వపు జాడలు!**

ప్రపంచానికి విజ్ఞాన కేంద్రంగా వెలుగొందుతున్న భారతదేశం, స్పేస్ టెక్నాలజీ, మెడికల్ సైన్స్, డిజిటల్ విప్లవంలో అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ, అసంఖ్యాకమైన ప్రజలు ఇప్పటికీ జాతకాలు, మంత్రాలు, వాస్తు, పంచాంగాలు, దయ్యాలు, పూజలు, బాణామతి వంటి మూఢనమ్మకాల అంధకారంలో బతికేస్తున్నారని అజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నరబలులు, బాణామతి పేరుతో చంపడాలు, హింసించటాలు వంటివి పెరగడం మనుషులను మరింత అంధకారంలోకి నెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇవి ప్రతీ మతంలోనూ ప్రజలను పట్టి పీడిస్తున్న



రుగ్మతలుగా ఉన్నాయని అన్నారు. ప్రతీ ఒక్కరు వారి నమ్మకాలను, సాంప్రదాయాలను ఆచరించడం, ఇతర మతాల వారి ఆచార సంప్రదాయాలను గౌరవించడం చాలా ముఖ్యం. అయితే ఈ ఆచార సంప్రదాయాలు వారి అభివృద్ధిని పెంపొందించే విధంగా ఉండాలే కానీ అజ్ఞానాన్ని విస్తరించేవిగా ఉండకూడదని ఆయన సూచించారు.
నమ్మకం, మూఢనమ్మకం మధ్య వ్యత్యాసం:
నమ్మకం అనేది తెలియని విషయాన్ని తెలుసుకునే వరకు కలిగే ఆశ అని, కానీ తెలిసిన తర్వాత కూడా అదే తప్పుడు భావనను కొనసాగించడమే మూఢనమ్మకమని అజయ్ కుమార్ వివరించారు. ఉదాహరణకు %–% సూర్యుణ్ని దేవుడిగా కొలచిన కాలం సరైనదే. కానీ శాస్త్ర విజ్ఞానం సూర్యుడు నక్షత్రమని నిరూపించిన తర్వాత కూడా భయంతో లేదా సంప్రదాయమనే ముసుగులో అతనిని దేవుడిగా భావించడం మూఢనమ్మకం కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు.

**మూఢనమ్మకాలకు మూలాలు:**

అజ్ఞానం, చదువు లేకపోవడం, తార్కికతకు కొరత, భయం, సమస్యలపై అవగాహన లేకపోవడం, సంప్రదాయాల పేరుతో మూఢత్వానికి ఊతం, అమాయకత్వం - తర్కం లేని విశ్వాసం వంటివి మూఢనమ్మకాలకు ప్రధాన కారణాలుగా ఆయన విశ్లేషించారు.

**మూఢనమ్మకాలు - ఎవరి జీవితాన్నీ వదలవు!**

మూఢనమ్మకాలు వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీయడం, ఆర్థికంగా దివాళా తీయించడం, సామాజిక అన్యాయానికి దారితీయడం, వ్యవసాయానికి హాని కలిగించడం వంటి అనేక దుష్పరిణామాలకు దారితీస్తున్నాయని అజయ్ కుమార్ అన్నారు. వివాహాలు, పిల్లల జాతకాలు, సమస్యలపై తంత్రాలు, మంత్రాలు, నరబలులు కుటుంబాలను నాశనం చేస్తున్నాయని, పూజలు, హోమాలు, తాయత్తులు పేరిట లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రజలు మోసపోతున్నారని తెలిపారు. బాలింతలపై మూఢనమ్మకాల పేరు మీద పీడనలు, బాలికలపై ఆచారాల పేరుతో అణచివేత, లింగ వివక్ష %–% ఇవన్నీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్న తుపానులే అని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఇప్పటికీ చీకట్లో - చదువుకున్నవారూ!**

చదువుకున్నవారిలో కూడా బలమైన తార్కిక దృక్పథం లేకపోతే, వారు కూడా బాణామతుల చీకటి మాయలో పడిపోతారని, ఐఏఎస్, ఐపీఎస్ లు, డాక్టర్లు, సైంటిస్టులంతా కూడా కొన్ని మూఢనమ్మకాల్లో నమ్మకాన్ని పెట్టడం మనం చూశామని, ఇది జ్ఞాన సమాజానికి పెనుముప్పని అజయ్ కుమార్ హెచ్చరించారు.

**బలైపోతున్నవారు - మూఢనమ్మకాల మాయలో...**

క్షుద్ర పూజల పేరుతో చిన్నారులపై అత్యాచారాలు, నరబలులు, బాణామతి నెపంతో మహిళలపై చిత్రహింసలు, సంప్రదాయాల పేరుతో జంతు బలులు, భయాలు పెంచి దోపిడీకి పాల్పడే మాంత్రికులు, పూజారులు వంటివి మన దేశ అభివృద్ధికి అడ్డుగోడలే అని ఆయన పేర్కొన్నారు.

**నిర్మూలనకు మార్గాలు:**

మూఢనమ్మకాల నిర్మూలనకు విద్యతో మార్పు తీసుకురావాలని, పిల్లలకు చిన్నతనం నుంచే తర్కబద్ధమైన ఆలోచనలు నేర్పాలని, పాఠశాల స్థాయిలో శాస్త్రీయ దృష్టి పాఠ్యాంశంగా ఉండాలని అజయ్ కుమార్ సూచించారు. మీడియా చైతన్యం, చట్టాలు - అంధశ్రద్ధ నిర్మూలన చట్టం అమలు, మేధావుల బాధ్యత వంటివి కీలకమని ఆయన నొక్కి చెప్పారు. మహారాష్ట్రలో అమలైనట్లు అంధవిశ్వాసాలపై నిషేధ చట్టాలు దేశవ్యాప్తంగా అవసరమని, మాంత్రికులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "నమ్మకం బ్రతికిస్తే - మూఢనమ్మకం బలిచేస్తుంది! కళ్ళు మూసుకుని నమ్మకాన్ని కొనసాగించడం కాదు కళ్ళు తెరిచి, విచారించి, తెలుసుకుని నడిచే సమాజం కావాలి. నేత్రసాక్షిగా గగనాన్ని చేరే విజ్ఞానయానం జరగాలంటే భూతాల నమ్మకాలను విడిచిపెట్టాలి!" అని ఆయన పిలుపునిచ్చారు. "మనుషుల బలహీనతలను, భయాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వారి వ్యాపార స్వార్థాలకు ఈ మూఢ నమ్మకాలను వ్యాప్తి చేసి పబ్బం గడుపుకుంటున్నారు, అలాంటిని వారిని అడ్డుకోవడం అందరి బాధ్యత," అని ఆయన అన్నారు. "గ్రహబలాలపై కాదు - కష్టపడి కలలు నెరవేర్చే నీ బలంపై నమ్మకం పెట్టు. అనుకున్నది సాధిస్తావు. ఆత్మవిశ్వాసం ముద్దు, అంధ విశ్వాసం వద్దు," అంటూ జి. అజయ్ కుమార్ తన ప్రసంగాన్ని ముగించారు.



---








## ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై మంత్రి సీతక్క సమీక్ష

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తెలుగు జనశక్తి జూన్ 9 :** సచివాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్స్, పెట్రోల్ బంకుల ఏర్పాటు, నూతన మహిళా సభ్యుల గుర్తింపు, కిశోర బాలికలు, దివ్యాంగులు, వయోధిక మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల పురోగతి, మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల స్కూల్ యూనిఫాంల సరఫరా తదితర అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ ఇందిరా మహిళా శక్తిలో అమలవుతున్న పథకాల స్టేటస్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పేదరిక నిర్మూలనలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని దివ్యా దేవరాజన్ కోరారు. ఈ కార్యక్రమంలో పి .ఆర్ .ఆర్ .డి సెక్రటరీ లోకేష్ కుమార్, పి .ఆర్. ఆర్ .డి డైరెక్టర్ సృజన, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ పర్సన్ సాధికార శాఖ డైరెక్టర్ శైలజతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

## జర్నలిస్టులు బాధ్యతలు విస్మరిస్తే సమాజాభివృద్ధికి విఘాతం

- బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం
- తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఆర్సి (తెలుగు జనశక్తి) జూన్ 09 :** జర్నలిస్టులు బాధ్యతలు విస్మరిస్తే సమాజాభివృద్ధికి విఘాతం కల్గుతుందని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహాదేవపూర్ బ్రహ్మకుమారిస్ "సైలెన్స్ రీట్రీట్ సెంటర్లో" జరిగిన జర్నలిస్టులకు మీడియా రోల్ ఆఫ్ ప్రమోటింగ్ పీస్, యూనిటీ అండ్ ట్రస్ట్ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ప్రతి జర్నలిస్ట్ బాధ్యతగా పని చేయాలనీ సూచించారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్స్ మీడియాలకు లైసెన్స్ ఉంటుందని, వీటిలో ఏదైనా తప్పుడు వార్తలు వస్తే, చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, కొన్ని సామాజిక మధ్యామాల వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, అలాంటివి రాకుండా ఉ ండాలంటే సామాజిక మద్యమాలు ఉపయోగించే ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులకు మంచి, చెడుపై ప్రెస్ అకాడమీ నుండి శిక్షణ తరగతులను నిర్వహించడం ప్రారంభించాం అన్నారు. తద్వారా వారి భాద్యతలు విధులు, రాసే వార్తల పై సమాజానికి ఇబ్బందులు తదితర అంశాలు వుంటా యన్నారు. దేశవ్యాప్తంగా ఏడాదికి జీడిపి 2.40లక్షల ఆదాయం వున్నా, ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు నెలకు 20వేల రూపాయలు సంపాదించుకోలేక పోతున్నారని అన్నారు. కుల మతాలకు అతీతంగా వారు చేస్తున్న సేవలు బాగున్నాయన్నారు. జర్నలిస్టుల్లో శాంతి, సమైక్యత, విశ్వసనియత, సత్యం, నిజాయితీ పెరిగితే ప్రజల్లో జర్నలిజం వృత్తి పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. సమాజంలో కుల, మతం పేరుతో ఐక్యమత్యానికి భంగం వాటిల్లుతుందన్నారు. ప్రపంచ శాంతికి కుల, మతాలు సైతం అడ్డు అన్న అభిప్రాయ పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ఏ దేశానికైనా యుద్ధం సరికాదన్నారు. ప్రపంచం శాంతికి ప్రతి ఒక్కరు ఐక్య మత్యంతో ముందుకు సాగాలన్నారు.



### రాజకీయాలకు మీడియా పెద్ద పీఠ

**ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఉప్పల లక్ష్మణ్**

మీడియా రాజకీయ రంగానికి పెద్ద పీఠ వేస్తుందని, ఇది సరి కాదని, మీడియాలో మార్పులు రావాలని మరో విశిష్ట అతిథి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు, టి జె ఏ ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్ అన్నారు. జర్నలిస్టులను రాజకీయ నాయకులు పావుల్లగా వాడుకుంటున్నారని అన్నారు. దాదాపు మీడియా స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందని, జర్నలుస్టులు రాసింది పత్రికాధిపతుల చేతులకు వెళ్లి వాళ్లకు నచ్చిందే రాస్తున్నారు తప్ప, ప్రజలకు ఉపయోగ పడే అనేక విషయాలు విస్మరిస్తున్నారని అన్నారు. మీడియాలో రాజకీయ జోక్యం ఉన్నంత వరకు పత్రిక రంగం మనుగడకే ప్రమాదంలో పడుతుందన్నారు. మీడియా అనేది సమాజ శ్రేయస్సుకు ఉపయోగ పడే విధంగా వుండాలన్నారు. బ్రహ్మకుమారీస్ వారు జర్నలిస్టులకు నిర్వహిస్తున్న సెమినార్లు ఎంతో ప్రయోజనకారంగా ఉన్నాయన్నారు. వివద రాష్ట్రాల నుండి వచ్చిన వక్తలు జర్నలిజం గురించి వివరించారు. ఈ సెమినార్లో ప్రభుత్వ పీఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్ విద్యావతి, బ్రాహ్మకుమారీస్ మీడియా వింగ్ వైస్ చైర్మన్ పర్సన్ సరళ, ఎస్ ఆర్ సీ డైరెక్టర్ రాజయోగిని బీ కే. దిది, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు సుప్రీం కోర్ట్ న్యాయవాది వై. బాబ్జి, ఎన్యూ జే (ఐ)ఉపాధ్యక్షులు వి. రాజేందర్ నాథ్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ జర్నలిస్ట్ సంఘాల జర్నలిస్ట్ లు, ఉర్దు, హిందీ, ఆంగ్ల పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

---



## జాతీయ స్థాయి బేస్ బాల్ ఇండియా పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపిక

**పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) జూన్ 9 :** సిరికొండ మండలం సిరికొండలో సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నరసయ్య మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా-2025 కప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల (నిజామాబాద్ పైరేట్స్) జట్టు ఎంపికైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. గత ఏప్రిల్ మాసం 21 నుంచి 24 వరకు ఆర్మూర్ మినీ స్టేడియం క్రీడా మైదానంలోజరిగిన నిజామాబాద్ రీజినల్ ఉభయ రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎం. యల్. బి ) అండర్ 11 ఛాంపియన్ పోటీలలో సత్యశోధక్ పాఠశాలకు (నిజామాబాద్ పైరేట్స్ )జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ నుహొకైవసం చేసుకోవడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడమైనది. జాతీయ స్థాయి కి ఎంపికైన పాఠశాల జట్టు విద్యార్థులు నరేందర్, శ్రీహిత్ రెడ్డి, శ్రీకాంత్, శరత్ చంద్ర, తిరుపతి, సాత్విక్, జశ్వంత్, మనోజ్, హేమంత్, రిత్విక్, సాయి సృజన్, సుమిత్లు నేడు బెంగుళూర్ వెళ్తున్న సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించడమైనది.కార్యక్రమంలో బేస్ బాల్ కోచ్ లు అనికేత్, సంతోష్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

---



## వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా గెలుపొందిన మహేష్‌కు శుభాకాంక్షలు

**కూకట్పల్లి, తెలుగు జనశక్తి, జూన్ 9 :** 124 అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన మహేష్ కాలనీ వాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది. అలాగే కార్పొరేటర్ మాట్లాడుతూ జయ శంకర్ కాలనీలో త్రాగు నీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని అన్నారు. ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలందరికీ అన్నివిధాల సహకారాన్ని అందిస్తూ, కాలనీ అభివృద్ధికి తోర్పడాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## ఆధునిక జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు

**: మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలుగు జనశక్తి జూన్ 9 :** ఆధునిక యుగంలో జర్నలిజం చారిత్రాత్మకమైన మార్పులకు లోనవుతోందని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పాత్రికేయులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపాన్ని దాల్చాయని తెలిపారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభతరం అవుతుందని, పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని, తెలుగు వార్తలను సులువైన భాషలో వ్రాయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంపాదకులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు, మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్తున్నాయని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు మార్కండేయ మాట్లాడుతూ, నూతన టెక్నాలజీని వినియోగించుకొని పాఠకులను ఆకర్షించే విధంగా వార్తలను సేకరించాలని వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని వ్రాయాలని







సూచించారు. అలాగే నేర వార్తలలో చేయాల్సినవి, చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ సెక్రటరీ ఎన్. వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీడ్ మీద కాదు..
# పిచ్ మీద దృష్టి పెట్టాలి

**టీమ్ఇండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్**



టీమ్ ఇండియా, ఇంగ్లండ్ మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. ఈ నేపథ్యంలో భారత బౌలింగ్ లైనప్‌పై టీమ్‌ఇండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ నమ్మకంతో ఉన్నాడు. వారు చక్కటి స్వింగ్‌ను అందుకుంటారని బౌలర్లపై విశ్వాసం వ్యక్తం చేశాడు. 'భారత నూతన బౌలింగ్ దళం ఇంగ్లండ్‌లో త్వరగానే తమ రిథమ్ అందుకుంటారు. అక్కడి పరిస్థితులకు త్వరగానే తమను తాము సర్దుబాటు చేసుకుంటారు. చిన్న చిన్న అడ్జస్ట్‌మెంట్లే ఒక బౌలర్‌కు ఎంతో కీలకం. పిచ్ మీద దృష్టి పెట్టాలి. స్పీడ్ మీద కాదు. భారత యువ బౌలింగ్ దళానికి ప్రతిభ ఉంది. గెలవాలన్న ఆకాంక్ష కూడా ఉంది. కాస్త ఓపికగా ఆడితే వారు కచ్చితంగా ఇంగ్లండ్‌ను ఆశ్చర్యానికి గురి చేయగలరు' అని భరత్ అరుణ్ ఓ క్రీడా ఛానల్‌తో అన్నాడు. 'ఇంగ్లండ్ పర్యటన ఎప్పటికీ ఓ సవాలే. కానీ మన భారత బౌలింగ్ దళంలో నిలకడ ఉంది. వాళ్లు కచ్చితంగా పరిస్థితులకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకుంటారు' అని టీమ్‌ఇండియా మాజీ బౌలర్ అశిష్ నెహ్రా కూడా ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుత భారత టెస్ట్ జట్టులో ఫాస్ట్ బౌలర్లలో బుమ్రా, సిరాజ్, ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌కు, స్పిన్ బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే ఇంతకు ముందు ఇంగ్లండ్‌లో అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. కానీ వీరిలో బుమ్రా వర్క్‌లోడ్ కారణంగా సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్‌లు గతంలో ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడారు. నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌కు మాత్రం ఇంగ్లండ్‌లో టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం లేదు. ఇదే వారికి మొదటి సిరీస్.



## 34 బంతుల్లో 75 పరుగులు చేసిన పృథ్వీ షా

టీ20 ముంబయి లీగ్ 2025లో భాగంగా నార్త్ ముంబయి పాంథర్స్ తరఫున బరిలోకి దిగిన పృథ్వీషా బ్యాటింగ్‌లో రాణించాడు. కేవలం 34 బంతుల్లో 75 పరుగులు సాధించాడు. తన అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో.. సూర్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రయంఫ్ నైట్స్ మంబయి నార్త్ ఈస్ట్‌పై తమ జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. హర్షల్ జాదవ్ (46) నుంచి పృథ్వీషాకు మద్దతు లభించింది. దీంతో వీరి టీమ్ 208 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి జట్టుకు నిర్దేశించింది. ఛేదనలో ట్రయంఫ్ నైట్స్ ముంబయి నార్త్ ఈస్ట్ చేతులెత్తేసింది. 19.5 ఓవర్లలో 169 పరుగులకే ఆలౌటైంది. సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేదు. 16 బంతుల్లో 29 పరుగులు మాత్రమే చేశాడు. ఓపెనర్ సిద్ధాంత్ ఆధాత్రావ్ 45 బంతుల్లో 76 పరుగులు చేశాడు. పరీక్షిత్ వల్సంగ్కర్ 15 బంతుల్లో 20, శిఖర్ ఠాకూర్ 13 బంతుల్లో 11 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. దీంతో ట్రయంఫ్ నైట్స్ ముంబయి నార్త్ ఈస్ట్‌పై పృథ్వీషా సారథ్యం వహిస్తున్న నార్త్ ముంబయి పాంథర్స్ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీ20 ముంబయి లీగ్ 2025కు సంబంధించి జూన్ 10న వాంఖడే స్టేడియంలో సెమీఫైనల్స్ జరగనున్నాయి. అదే వేదికగా జూన్ 12న ఫైనల్స్ నిర్వహించనున్నారు.

## డబ్ల్యూటీసీలో భారీ రికార్డుపై కన్నేసిన బుమ్రా



ఇంగ్లండ్, భారత్ మధ్య జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను ఇది వరకు పటౌడీ ట్రోఫీగా పిలవగా.. తాజాగా తెండుల్కర్-అండర్సన్ ట్రోఫీగా నామకర ణం చేశారు. తొలి టెస్టు హెడింగ్లీలోని లీడ్స్ వేదికగా జరగ నుంది. ఇంగ్లండ్‌లో భారత్ చివరగా 2007లో టెస్టు సిరీస్ నెగ్గింది. కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్‌తో యువ ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. వీరు ఇంగ్లండ్‌లో ఏ మేరకు రాణిస్తారో చూడాలి. బ్యాటర్లు రాణించడంతో బౌలింగ్ దళం కూడా సమష్టిగా రాణిస్తే అక్కడ భారత్ మళ్లీ సిరీస్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే, ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనే ఆడనున్నాడు. ఈ సిరీస్‌లో బుమ్రా ఏ మూడు మ్యాచ్‌ల్లో ఆడతాడు అనే దానిపై స్పష్టత లేదు. అయితే, రానున్న సిరీస్‌లో బుమ్రా భారీ రికార్డు అందు కునే అవకాశముంది. మరో రెండుసార్లు ఐదు వికెట్ల ఘనత సాధిస్తే అద్భుత రికార్డు తన పేరిట లిఖించుకుంటాడు. డబ్ల్యూ టీసీ చరిత్రలో 12 సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం రవిచంద్రన్ అశ్విన్ (11) ఒక్కడే బుమ్రా కంటే ముందున్నాడు.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన..

### హైకోర్టును ఆశ్రయించిన ఆర్సీబీ




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం వేళ బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట పెను విషాదం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఆర్సీబీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ నేపథ్యంలోనే ఆర్సీబీ యాజమాన్యం కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. ఆ కేసును కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేసింది. తమను తప్పుడు కేసులో ఇరికించారని ఆర్సీబీ, రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎస్ఎల్) తరఫు న్యాయవాది వాదించారు. తమపై నమోదైన కేసును రద్దు చేయాలని కోర్టును కోరారు. మరోవైపు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా తమపై నమోదైన కేసుకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. కాగా.. ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనలో పెను ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబం ధం ఉన్న పలువురిపై కేసు నమోదైంది. తాజాగా తమ పై ఉన్న కేసును రద్దు చేయాలని కోరుతూ ఆర్సీబీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆర్సీబీ, డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్లపై విచారణ జరిపేందుకు న్యాయస్థానం అంగీకరించింది. జూన్ 10న విచారిస్తామని తెలిపింది.

## జేఎస్‌డబ్ల్యూ నుంచి భారీ వర్క్ ఆర్డర్ పొందిన ఎల్ అండ్ టీ

లార్సెన్ టూబ్రోకు సంబంధించిన హెవీ సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సోమవారం మహారాష్ట్రలో భవాలీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనుల కోసం ఎనర్జీ నుంచి భారీ వర్క్ ఆర్డర్‌ను పొందింది. 1500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్‌లో రిజర్వాయర్లు, సొరంగాలు, భూగర్భ పవర్‌హౌస్‌తో సహా విస్తృతమైన సివిల్ వర్క్స్ ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ మహారాష్ట్రలోని నాసిక్, థానే జిల్లాల్లో ఉంది. వివిధ చిన్న యూనిట్లను కలిగి ఉన్న ఈ ప్రాజెక్ట్ మొత్తం 1500 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉండేలా రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ పనిలో అప్రోచ్ రోడ్లు, జలాశయాలు, వాటర్ కండక్టర్ సిస్టం, ప్రెషర్ టన్నెల్స్, భూగర్భ పవర్‌హౌస్ యూనిట్ నిర్మాణంతో సహా ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని సివిల్ వర్క్స్ ఉంటాయి.

## రుణ రేట్లు దిగివస్తున్నాయ్



**దిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 50 బేసిస్ పాయిం ట్లు తగ్గించిన నేపథ్యంలో.. రెపో రేటుకు అనుసంధానమైన రుణ రేట్ల (ఆర్ఎ ల్ఎల్ఆర్)ను బ్యాంకులు తగ్గిస్తున్నాయి. ఆర్‌బీఐ ప్రకటన వచ్చిన వెంటనే, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) రుణరేట్లు తగ్గిస్తున్నట్లు వెల్లడించాయి. తదుపరి బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూకో బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్ తగ్గించాయి.

- బ్యాంక్ ఆఫ్ బరోడా తన ఆర్ఎల్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.15 శాతానికి పరిమితం చేసింది. ఈ నెల 7 నుంచే ఇది అమల్లోకి వచ్చింది.
- యూకో బ్యాంక్ నిధుల వ్యయం ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), ఆర్ఎల్ఎల్ఆర్‌ను ఈనెల 10 నుంచి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. అన్ని కాల వ్యవధుల ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్‌ను 8.25% నుంచి 8.15 శాతానికి తీసుకొచ్చింది. ఒక నెల ఎంసీఎల్ఆర్‌ను 8.35 శాతానికి, 3 నెలల ఎంసీఎల్ఆర్‌ను 8.5 శాతానికి, 6 నెలల ఎంసీఎల్ఆర్‌ను 8.8 శాతానికి, ఏడాది ఎంసీఎల్ఆర్‌ను 9 శాతానికి తగ్గించింది. ఆర్ఎల్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.30 శాతానికి పరిమితం చేసింది.
- కరూర్ వైశ్యా బ్యాంక్ ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గించి 9.80 శాతానికి పరిమితం చేసింది. 6 నెలల ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. మిగతా కాల వ్యవధుల రేట్లను యథాతథంగా ఉంచింది. కొత్త రేట్లు ఈ నెల 7 నుంచే అమల్లోకి వచ్చాయి.
- ప్రైవేటు రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటును అన్ని కాల వ్యవధులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నెల 7 నుంచి తగ్గించిన రేట్లు అమల్లోకి వచ్చాయి. ఓవర్‌నైట్, ఒక నెల ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు తగ్గి, 8.9 శాతానికి పరిమితమైంది. 3 నెలల రేటు 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది ఎంసీఎల్ఆర్ 9.05 శాతానికి, రెండేళ్లు, మూడేళ్ల కాల వ్యవధుల ఎంసీఎల్ఆర్ 9.2 శాతానికి తగ్గాయి.
- పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈనెల 9 నుంచి అమల్లోకి వచ్చేలా ఆర్ఎల్ఎల్ఆర్‌ను 8.85% నుంచి 8.35 శాతానికి కుదించింది. నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను మార్చలేదు.
- బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఆర్ఎల్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.35 శాతానికి తీసుకొచ్చింది. ఈ నెల 6 నుంచే ఇది అమల్లోకి వచ్చింది.

# 'డార్క్' మోసాలకు చెక్

### డార్క్ పాటర్న్స్‌పై కేంద్రం నజర్



ఇ-కామర్స్ సైట్‌లో రూ.150కు ఓ వస్తువు కనిపించింది. దానిపై రూ.100 కూపన్. తీరా కొనుగోలు పూర్తి చేసేటప్పటికి అది ఏ రూ.80, 90 అయిపోతుంది. అదేంటి! రూ.100 తగ్గింపు అంటే వస్తువు ధర రూ.50 కదా కావాలి? సర్లే! రూ.150 వస్తువు రూ.100కైనా కొన్నాం కదా అని సంబరపడిపోతుంటాం. ఇంతకీ ఆ వస్తువు అవసరమా? అనే ప్రశ్న వేసుకుంటే దానికి 'నో' అనే సమాధానం వస్తుంది. మరి మనకు అవసరం లేకుండా ఆ వస్తువును కొన్నట్లే కదా. అదే ఇ-కామర్స్ సైట్‌ల మాయాజాలం. మనకే తెలియకుండా మన చేత అవసరం లేని వస్తువులను కొనిపించడం లేదా అధికంగా కొనిపించడమే ఆయా సంస్థల 'డార్క్'స్టైల్. వీటినే డార్క్‌పాటర్న్స్‌గా వ్యవహరిస్తారు. వీటివల్ల మన జేబులకు చిల్లు పడుతోంది. ఇలాంటి వాటికి చెల్లుచీటి పాడేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇ-కామర్స్ సంస్థలకు ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేసింది.

### కేంద్రం ఏం చెప్పింది?

వినియోగదార్లను తప్పుదోవ పట్టించేలా తమ వెబ్‌సైట్‌ల్లో ఏమైనా ప్రకటనలు ఉంటే వాటిని గుర్తించి, తొలగించేందుకు స్వీయ ఆడిట్‌ను నిర్వహించుకోవాలని ఇ-కామర్స్ సంస్థలను సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఆదేశించింది. మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ అమలుచేయాలని తెలిపింది. ఈ చర్యల వల్ల ఇ-కామర్స్ సంస్థలపై వినియోగదారుల్లో విశ్వాసం మరింత బలపడుతుందని తెలిపింది. అనైతిక వాణిజ్య మార్గాలు పాటించడం లేదా వినియోగదార్ల ఎంపిక నిర్ణయాన్ని ప్రభావం చూపించే విధానాలకు తమ ప్లాట్‌ఫామ్‌లు వేదికగా ఉన్నాయా? అనే విషయాన్ని కూడా ఇ-కామర్స్ సంస్థలు తప్పక పరిశీలించుకోవాలని వాణిజ్య వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. డార్క్ ప్యాటర్న్స్ నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలను ఉల్లంఘించాయని కొన్ని ఇ-కామర్స్ సంస్థలు ఇప్పటికే సీసీపీఏ నోటీసులు జారీ చేసింది. ఏయే కంపెనీలకు జారీ చేసిందీ మాత్రం వెల్లడించలేదు.

### ఇన్ని రకాల డార్క్ మోసాలా?

వస్తువు లేదా సేవలను అంటగట్టేందుకు అనుసరించే వివిధ పద్ధతులే డార్క్ పాటర్న్స్‌గా వ్యవహరిస్తారు. వినియోగదారుల నిర్ణయాన్ని ప్రభావితం చేయడం, వారిని గందరగోళానికి గురిచేయడం, బలవంతంగా షాపింగ్ చేయించడమే వీటి లక్ష్యం. ఇలాంటి 13 రకాల డార్క్ పాటర్న్స్‌ను సీసీపీఏ గతంలోనే గుర్తించింది. అలాంటి వాటికి దూరంగా ఉండాలని ఇ-కామర్స్ సంస్థలకు సూచించింది. అందులో కొన్ని..


- **ఫాల్స్ అర్జెన్సీ:** రండి బాబూ రండీ! ఆలస్యం చేస్తే ఆశాభంగం! అంటూ గతంలో మైకులో వినే వాళ్లం. ఆ తరహా ప్రచారానికి ఆధునిక రూపమే ఈ ఫాల్స్ అర్జెన్సీ. ఏదైనా వస్తువును నిర్దేశిత సమయంలో కొనుగోలు చేయకపోతే ఆఫర్‌ను కోల్పోతామని యూజర్‌ను గందరగోళంలోకి నెట్టేయడం ఈ పాటర్న్ ముఖ్య ఉద్దేశం.
- **బాస్కెట్ స్నీకింగ్:** కొన్ని ప్లాట్‌ఫామ్‌లు యూజర్ల అనుమతి లేకుండా కొన్ని వస్తువులు లేదా సేవలను అదనంగా షాపింగ్ కార్ట్‌కు జోడిస్తుంటాయి. లేదా డొనేషన్, చారిటీ అంటూ పేమెంట్ చెక్‌బాక్స్‌ను యాడ్ చేస్తాయి. ఇవన్నీ కస్టమర్‌కు తెలియకుండానే తన పేమెంట్‌కు జమ అయి తాను కొన్న వస్తువు రేటు కంటే ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది.
- **సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్:** వినియోగదారులకు సేవల కోసం సైన్ అప్ చేసుకోమని సూచించడం, ఆపై దాన్ని రద్దు చేయడానికి వీలుకాకుండా చేయడం మరో ఎత్తుగడ. ఒకవేళ క్యాన్సిల్ చేయడానికి ప్రయత్నించినా అనేక దశలు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుంది.
- **ఫోర్స్‌డ్ యాక్షన్:** ఇదో తరహా ట్రిక్కు. కొన్నిసార్లు యూజర్లు అదనంగా వస్తువులను కొనేలా బలవంతం చేస్తారు. లేదా అక్కర్లేని సర్వీసుకు తనకు ఇష్టం లేకపోయినా అంటగడతారు. వారెంటీ, సబ్‌స్క్రిప్షన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వస్తువును కొనే క్రమంలో వ్యక్తిగత సమాచారాన్ని అవసరం లేకపోయినా తప్పనిసరిగా షేర్ చేయడం కూడా ఫోర్స్‌డ్ యాక్షన్ కిందకే వస్తుంది.
- **కన్ఫామ్ షేమింగ్:** ఆడియో, వీడియో, పద బంధాల రూపంలో యూజర్‌ను షేమ్ చేయడం. ఇన్సూరెన్స్ తీసుకోకపోతే 'ఫ్యామిలీని రిస్క్ పెడుతున్నారా' 'దాతృత్వం పెద్దలకే' అనే డైలాగులతో యూజర్‌ను కొనుగోలుకు ప్రేరేపించడం మరో తరహా మోసం.
- **న్యాగింగ్:** ఏదైనా వెబ్‌సైట్ తమ యాప్ డౌన్లోడ్ చేసుకోమని పదే పదే అడగడం, నోటిఫికేషన్లు ఆన్ చేసుకోమని పదే పదే కోరడం వంటివి ఈ పద్ధతి కిందకు వస్తాయి.
- **ఇంటర్ఫేస్ ఇంటర్ఫియరెన్స్:** ఇంటర్ఫేస్‌లో మార్పుల ద్వారా వినియోగదారుడిని తప్పుదోవ పట్టించడం. తమకు కావాల్సిన యాక్షన్‌కు మాత్రమే కలర్ ఇచ్చి హైలైట్ చేయడం వంటివి ఈ ప్యాటర్న్ కిందకు వస్తాయి.
- **బెయిట్ అండ్ స్విచ్:** తక్కువ ధరకే వస్తుంది కదా అని వినియోగదారుడు ఆ వస్తువును కొనుగోలు చేయడానికి ప్రయత్నించగానే అది లేదని చూపి.. దాన్ని పోలి ఉన్న మరో ప్రోడక్టును అధిక ధరకు అంటగట్టడం మరో తరహా మోసం.
- **హిడెన్ కాస్ట్స్:** ఒక వస్తువు కొనుగోలు చేసే ముందు వరకు ఒక ధర కనిపిస్తుంది. చివరికి పేమెంట్ పేజీ వరకు వెళ్లేసరికి కొత్త కొత్త ఛార్జీలన్నీ కలిసి ఆ ధర పెరిగిపోతుంటుంది.

## లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం సూచీలకు బూస్ట్ ఇచ్చింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ రాణించాయి. దీనికితోడు భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి, అమెరికాలో మెరుగైన జాబ్ డేటా, అమెరికా-చైనా మధ్య జరగబోయే వాణిజ్య చర్చల్లో సానుకూల నిర్ణయం వెలువడవచ్చన్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ 25,100 ఎగువన స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం 82,574.55 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,188.99) లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 82,669 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 256.22 పాయింట్ల లాభంతో 82,445.21 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 100 పాయింట్లు లాభంతో 25,103.20 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. ఔన్సు బంగారం ధర 3340 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ర్యాపిడో.. స్విగ్గీ, జొమాటో షేర్లు షేక్





ఫుడ్ డెలివరీ విభాగంలో స్విగ్గీ, జొమాటోలదే రాజ్యం. గతంలో కొన్ని కంపెనీలు ఈ విభాగంలో అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల పోటీలో నిలవలేకపోయాయి. ఇప్పుడు క్యాబ్ సేవలందిస్తున్న ర్యాపిడో ఈ విభాగంలో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ కంపెనీ అనుసరించబోయే ఫిక్స్‌డ్ కమీషన్ మోడల్ స్విగ్గీ, జొమాటోను కలవరపరుస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లు నేడు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఓలా, ఉబర్ తరహాలో క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ర్యాపిడో ఫుడ్ డెలివరీ విభాగంలోకి త్వరలో అడుగుపెట్టనుంది. ఇందులో భాగంగా రెస్టారంట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం రూ.400లోపు ఆర్డర్లపై రూ.25, రూ.400పైబడిన ఆర్డర్లపై రూ.50 చొప్పున హోటళ్లు/ రెస్టరంట్ల నుంచి కమీషన్ తీసుకోనుంది. అంటే కమీషన్ 8-15శాతం మధ్య ఉండనుంది. ప్రస్తుతం స్విగ్గీ, జొమాటో 16-30 శాతం కమీషన్‌తో పోలిస్తే దాదాపు సగం కావడం గమనార్హం. జులై నెలలో బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఈ సేవలకు ర్యాపిడో శ్రీకారం చుట్టనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ర్యాపిడో యాప్‌లోనే రెస్టారంట్ల లిస్ట్ కూడా కనిపించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ విభాగంలో స్విగ్గీ, జొమాటో గుత్తాధిపత్యానికి ర్యాపిడో ఫిక్స్‌డ్ కమీషన్ మోడల్ చెక్ పెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో మార్కెట్ పాజిటివ్‌గా ఉన్నప్పటికీ.. రెండు కంపెనీల షేర్లు మాత్రం నేడు నష్టాల్లో ముగిశాయి. జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ షేరు విలువ ఎన్ఎస్ఈలో దాదాపు 2 శాతం నష్టంతో రూ.256 వద్ద ముగిసింది. స్విగ్గీ షేరు విలువ 2.63 శాతం నష్టంతో రూ364.90 వద్ద స్థిరపడింది.

జనశక్తి

# బాయ్‌ఫ్రెండ్ ప్లాన్.. సోనమ్ సుపారీ

## హనీమూన్ హత్య కేసులో సంచలన విషయాలు





**ఉత్తర్‌ప్రదేశ్ :** హనీమూన్‌కు వెళ్లి మేఘాలయలో హత్యకు గురైన కేసులో.. మృతుడి భార్యను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో ఈ కేసు కీలకమలుపు తిరిగింది. కాంట్రాక్ట్ కిల్లర్లకు సుపారీ ఇచ్చి భర్త రాజా రఘువంశీని సోనమ్ చంపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆమెకు రాజ్‌కుశ్వాహ్ అనే వ్యక్తితో సంబంధం ఉందని, అతడే రఘువంశీ హత్యకు కుట్రపన్నాడని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. సోనమ్ కాకుండా ఈ కేసులో మరో ముగ్గురు విక్కీ ఠాకూర్, ఆకాశ్, ఆనంద్ అరెస్టయ్యారు. విచారణలో ఆనంద్ చెప్పిన విషయాలతో రాజ్‌కుశ్వాహ్ పేరు వెలుగులోకివచ్చింది. దాంతో అసలు హత్య జరిగిన తీరు, ప్రతి విషయాన్ని అన్ని కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. ఈ కుట్ర మేఘాలయకే పరిమితం కాలేదని అనుమానిస్తున్నారు.

### ఆ 'బాయ్‌ఫ్రెండ్' సోనమ్ ఉద్యోగి..?

ఈ కేసులో సోనమ్ బాయ్‌ఫ్రెండ్‌గా అనుమానిస్తున్న రాజ్ కుశ్వాహ్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. కుశ్వాహ్‌తో ఆమె తరచూ మాట్లాడుతుందని మృతుడు రాజా రఘువంశీ సోదరుడు తెలిపారు. సోనమ్ నిర్వహిస్తున్న ఓ కంపెనీలో అతడు ఉద్యోగి అన్న విషయం మాత్రమే తమకు తెలుసన్నారు. ఇందౌర్‌కు చెందిన రాజ్ కుశ్వాహ్‌కు సోనమ్‌తో కొంతకాలంగా సాన్నిహిత్యం ఉందని, అతడి ప్లాన్ ప్రకారమే భర్తను హత్య చేసి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత కన్పించకుండా పోయారు. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి ఆమె గాజీపుర్‌లో ప్రత్యక్షమైంది. ఈ కేసులో ఆమె లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు.

### నేను చంపలేదు.. నన్నే కిడ్నాప్ చేశారు : సోనమ్

హనీమూన్‌లో భర్తను హత్య చేసిందన్న ఆరోపణలపై అరెస్టయిన సోనమ్ రఘువంశీ కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో తాను నిందితురాలిని కాదని ఆమె పోలీసు విచారణలో చెప్పినట్లు సమాచారం. తనను కిడ్నాప్ చేశారని ఆమె తెలిపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. "ఈ కేసులో నేను నిందితురాలిని కాదు. నన్ను ఎవరో కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత గాజీపుర్‌లో వదిలేసి వెళ్లిపోయారు. అక్కడి నుంచే నేను మావాళ్లకి ఫోన్ చేశా" అని సోనమ్ విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. గాజీపుర్‌లోని ఓ హోటల్ వద్ద నుంచి ఆమెను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని హోటల్ సిబ్బంది కూడా తెలిపారు. తన ఫోన్ నుంచే ఆమె వాళ్ల కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు.

### నా కుమార్తె అమాయకురాలు : సోనమ్ తండ్రి

ఈ పరిణామాలపై సోనమ్ తండ్రి దేవీ సింగ్ స్పందించారు. "నా కుమార్తెకు ఏ పాపం తెలియదు. నా బిడ్డపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఆమె అలా చేసి ఉండదు. ఇరుకుటుంబాల సమ్మతితోనే వారి పెళ్లి జరిగింది. గాజీపుర్‌లోని రోడ్డుపక్కన ఒక హోటల్ వద్దకు ఆమె చేరుకుంది. అప్పుడు ఏడుస్తూనే ఉంది. అక్కడినుంచి ఫోన్ చేసి, తన లొకేషన్ చెప్పింది. పోలీసులు అక్కడికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇంతవరకు నేను నా కుమార్తెతో మాట్లాడలేదు. ఆమె అలా ఎందుకు చేస్తుంది. మేఘాలయ పోలీసులు అబద్ధం చెప్తున్నారు. నా కుమార్తె తనంతటతానుగానే గాజీపుర్‌కు వచ్చింది. ఆమెను మేఘాలయలో అరెస్టు చేయలేదు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాను" అని ఆయన వాపోయారు.

### ఆమె చెప్పిన తర్వాతే..: మృతుడు సోదరుడు

"సోనమ్ మాకు కాల్ చేసింది. మా సమాచారంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె చాలా భయపడిపోయింది. సోనమ్ లొకేషన్ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉంది. మధ్యప్రదేశ్‌లో ఇతర అనుమానితుల్ని అరెస్టు చేశారు. ఇక్కడ చాలా తేడా కనిపిస్తోంది. ఆమె చెప్పిన తర్వాతే ఏం జరిగిందనే దాన్ని మేం నమ్ముతాం" అని మృతుడి సోదరుడు విపిన్ మీడియాకు వెల్లడించారు.

# కేరళ తీరం వద్ద సింగపుర్ పతాక నౌకలో పేలుడు..



**న్యూఢిల్లీ :** సింగపుర్ పతాకంతో ప్రయాణిస్తున్న ఓ కంటైనర్ షిప్‌లో సోమవారం ఉదయం భారీ పేలుడు చోటు చేసుకొంది. ఈ విషయాన్ని రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. ఉదయం 10.30 సమయంలో ఎంవీ వాన్ హై 503 కేరళ తీరానికి సమీపంలోకి చేరుకొన్న సమయంలో దాని లోపల పేలుడు సంభవించింది. వెంటనే అప్రమత్తమైన నౌకాదళం ఐఎన్ఎస్ సూరత్‌ను అత్యవసర సహాయం కోసం సదరు నౌక వద్దకు తరలించింది. దీంతోపాటు నేవల్ స్టేషన్ ఐఎన్ఎస్ గరుడ్ నుంచి డోర్నియర్ విమానంతో ఆ ప్రదేశంలో సార్టీలు చేపట్టింది. దాదాపు 270 మీటర్ల పొడవు, 12.5 మీటర్ల పొడవున్న ఈ నౌక జూన్7న కొలంబో తీరం నుంచి బయల్దేరింది. ఇది జూన్ 10వ తేదీ నాటికి ముంబయికి చేరుకోవాల్సి ఉంది. ఇటీవల లైబీరియాకు చెందిన ఎంఎస్‌సీ ఎల్సా-3 నౌక ప్రమాదానికి గురైంది. కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చారు. నాడు దీనిలో చమురు, పర్నేస్ ఆయిల్‌తోపాటు కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలు ఉన్నాయి.

# భారత్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం : జీఈ సీఈవో



**న్యూఢిల్లీ :** భారత్ చేపట్టిన ఐదోతరం యుద్ధ విమానాల ప్రాజెక్టు కోసం ఇంజిన్లను తయారుచేసేందుకు తమ సంస్థ ఆసక్తిగా ఉన్నట్లు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ సీఈవో లారీ కల్ప్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో పాటు ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)కు ఇంజిన్లు అందించే కాంట్రాక్టు కోసం పోటీపడతామని పేర్కొన్నారు. పౌర, మిలిటరీ వైమానిక రంగ కార్యకలాపాల్లో భారత్‌ను ఓ ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తేజస్ మార్క్-1ఏ ఫైటర్ జెట్ కోసం ఎఫ్-404 ఇంజిన్ల సరఫరాను వేగవంతం చేస్తామని జీఈ సంస్థ చెప్పింది. వాస్తవానికి వీటి సరఫరాల్లో ఇప్పటికే చాలా జాప్యం నెలకొంది. భారత్ మొత్తం 99 ఇంజిన్లు ఆర్డర్ పెట్టగా.. మార్చి నాటికి కేవలం ఒకటి మాత్రమే అందించింది. అనుకున్న దానికంటే రెండేళ్లు జాప్యం జరిగింది. దీనిపై జనరల్ ఎలక్ట్రిక్ సీఈవో లారీ కల్ప్ మాట్లాడుతూ "విడిభాగాల సరఫరాలను పెంచేందుకు మా సప్లయర్స్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఈ ఏడాది తొలి త్రైమాసికంతో పోలిస్తే.. ఏప్రిల్-మే నెలల్లో పురోగతి సాధించాము" అని ఓ ఆంగ్లపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. భారత్‌లో తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు వాణిజ్య విమానాల నిర్వహణ, మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి తేజస్ ఎంకే-1ఏ ప్రాజెక్టులో జరుగుతున్న జాప్యంపై ఇప్పటికే పలుమార్లు ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉత్పాదక శక్తికి ఉన్న పరిమితుల వల్ల వైమానిక దళ, వాణిజ్య విమానాల డెలివరీల్లో జాప్యం చోటుచేసుకొంటోంది. ప్రస్తుతం జీఈ సంస్థ భారత్ విమానాల్లో 1,400 ఇంజిన్లను వాడుతుంది. వీటిల్లో చిన్న, పెద్ద విమానాలు ఉన్నాయి. భవిష్యత్తులో వీటి సంఖ్య 2,500కు చేరవచ్చు.

# అశ్లీల చిత్రాల్లో నటించాలని ఒత్తిడి..

## 6 నెలలుగా ఫ్లాట్‌లో బంధించి చిత్రహింసలు



**కోల్‌కతా:** అశ్లీల చిత్రాల్లో నటించడానికి ఒప్పుకోకపోవడంతో ఓ యువతిని 6 నెలల పాటు చిత్రహింసలకు గురిచేసిన ఘటన పశ్చిమ బెంగాల్‌లో చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తల్లీ కుమారులు శ్వేతాఖాన్, ఆర్యన్‌ఖాన్‌లు ఓ యువతిని ఉద్యోగం పేరిట ట్రాప్ చేశారు. అనంతరం అశ్లీల చిత్రాల్లో నటించాలని, బార్ డ్యాన్సర్‌గా పని చేయాలని బలవంతం చేయగా అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో 6 నెలలుగా ఓ ఫ్లాట్‌లో బంధించి చిత్రహింసలకు గురిచేశారు. బాధితురాలు వారి నుంచి తప్పించుకొని పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తల్లీ కుమారులు శ్వేతాఖాన్, ఆర్యన్‌ఖాన్‌లు ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ముసుగులో అశ్లీల వీడియోల రాకెట్‌ను, దానికి సంబంధించిన ఫిల్మ్ ప్రొడక్షన్ హౌస్‌ను నడుపుతున్నారు. ఇందులోభాగంగానే ఎక్కువ జీతం ఆశ చూపి నిరుద్యోగ యువతులను ఉద్యోగం పేరుతో నమ్మించేవారు. అనంతరం అశ్లీల చిత్రాల్లో నటించాలని వారిని బలవంతం చేసేవారు. 6 నెలల క్రితం 24 ఉత్తర పరగణా జిల్లాకు చెందిన ఓ యువతి ఉద్యోగం కోసం ఫేస్‌బుక్‌లో ఆర్యన్‌ను సంప్రదించింది. హౌరాలోని తమ నివాసానికి వస్తే ఉద్యోగం ఇప్పిస్తామని అతడు నమ్మబలకడంతో ఉద్యోగం గురించి చర్చించడానికి వారి ఇంటికి వెళ్లింది. ఆర్యన్ అతడి తల్లి శ్వేతతో కలిసి ఆ యువతిని బార్ డాన్సర్ వృత్తిలోకి దించడానికి ప్రయత్నించారు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో ఆమెపై దాడి చేశారు. అనంతరం ఆమె మొబైల్ లాక్కొని, ఓ ఫ్లాట్‌లో బంధించారు. ఆరు నెలల పాటు తనను ఇనుపరాడ్డుతో తీవ్రంగా కొడుతూ, హింసించేవారని.. నాలుగు రోజులకు ఒకసారే భోజనం పెట్టేవారని బాధితురాలు పోలీసులకు తెలిపింది. అమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని.. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. వారు సెక్స్ రాకెట్ కూడా నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

# రైల్లో నుంచి జారిపడిన ప్రయాణికులు


## ఐదుగురు మృతి



**ముంబయి:** మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి పలువురు ప్రయాణికులు జారిపడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. ఠాణెలోని ముంబ్రా, దివా స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్ నుంచి ఠాణె కసారా బయల్దేరిన లోకల్ రైలులో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. రద్దీ కారణంగా అనేక మంది డోర్ల వద్ద వేలాడుతూ కన్పించారు. రైలు ముంబ్రా స్టేషన్ సమీపంలోకి రాగానే ప్రయాణికులు అదుపుతప్పారు. దీంతో 10-12 మంది ప్రయాణికులు జారి పడిపోయారు. అదే సమయంలో పక్కనే ఉన్న పట్టాలపై ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు మృతి చెందగా.. మిగతా వారికి గాయాలయ్యాయి. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

# విమానం ఎక్కుతూ తూలిపడిన ట్రంప్

## నెటిజన్ల ట్రోలింగ్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త తడబాటుకు గురయ్యారు. విమానం మెట్లు ఎక్కుతూ తూలిపడ్డారు. ఈ దృశ్యాలను షేర్ చేస్తూ.. నెటిజన్లు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ను గుర్తుచేస్తున్నారు. అసలేమయ్యిందంటే.. న్యూజెర్సీలోని మోరిస్టౌన్‌లోని మోరిస్టౌన్ మున్సిపల్ విమానాశ్రయం నుంచి బయలుదేరే సమయంలో ట్రంప్ విమానం మెట్లు ఎక్కుతూ.. మెట్లపై పొరపాటున తూలిపడ్డారు. అయితే ట్రంప్ తర్వాత అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో సైతం తూలిపడటం గమనార్హం. ఈ దృశ్యాలను నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. గతంలో బైడెన్ విమానం ఎక్కుతూ తూలిపడటంతో ఆయన విమానం కూడా ఎక్కలేకపోతున్నారని ట్రంప్ ఎగతాళి చేయడాన్ని గుర్తు చేస్తూ వరుస పోస్టులు పెట్టారు. ఇప్పుడు ట్రంప్ స్థానంలో బైడెన్ ఉండి ఉంటే ఇప్పటికే టీవీ ఛానళ్లలో బ్రేకింగ్ న్యూస్ వచ్చేది అంటూ ఓ నెటిజన్ చమత్కరించారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. ట్రంప్ మెట్లు కూడా ఎక్కలేకపోతున్నాడు కాబట్టి అధ్యక్ష స్థానానికి అనర్హుడు అని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరో నెటిజన్ స్పందిస్తూ.."గతంలో బైడెన్ ఇదేవిధంగా తూలిపడినప్పుడు ఆయన వీడియోను రోజుల తరబడి పదేపదే ప్రదర్శించిన ట్రంప్ మీడియాలు ఇప్పుడు నిశ్శబ్దంగా ఎందుకున్నాయో" అంటూ రాసుకొచ్చాడు. 2021లో జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఓ కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి వెళ్లేందుకు విమానం వద్దకు వచ్చారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం మెట్లు ఎక్కే క్రమంలో వరుసగా మూడుసార్లు జారిపడ్డారు. 2024లోను ఇదేవిధంగా విమానం ఎక్కుతూ తూలిపడ్డారు. దాంతో బైడెన్‌కు వృద్ధాప్య సమస్యలు తీవ్రమవుతున్నాయని.. జ్ఞాపకశక్తి కూడా క్షీణించిందని అప్పట్లో ట్రంప్ విమర్శలు గుప్పించారు. అటువంటి వ్యక్తి అమెరికాను ఎలా ముందుకు తీసుకెళ్లగలరని ప్రశ్నిస్తూ ఎగతాళి చేశారు.

# ఐఈడీ పేల్చిన మావోయిస్టులు

## అదనపు ఎస్పీ మృతి

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి ఒడిగట్టారు. దోంద్రా సమీపంలో పోలీసు వాహనాన్ని ఐఈడీతో పేల్చేశారు. ఈ ఘటనలో అదనపు ఎస్పీ ఆకాశ్ రావు గిరిపుంజే మృతి చెందారు. డీఎస్పీ, సీఐ సహా పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అదనపు బలగాలు సంఘటనా స్థలికి చేరుకున్నాయి. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

### దాడి కోసం ఉచ్చులోకి లాగారా..?

జూన్ 10వ తేదీన మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి. ఆదివారం మావోలు చిక్వార్ గూడ వద్ద పొక్లెయిన్‌ను దహనం చేశారు. దీంతో ఆ ప్రదేశానికి వెళ్లేందుకు.. కాంటా-ఎరబోరా మార్గంలో ఏఎస్పీ ఆకాశ్‌రావ్, మిగిలిన సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు ప్రెజర్ ఐఈడీని పేల్చారు. దీంతో ఏఎస్పీ తీవ్రంగా గాయపడటంతో.. సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు. గాయపడిన వారికి కొంటా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిపై ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆకాశ్‌రావ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన యోధుడని కొనియాడారు. ఆయన మృతి విషాద క్షణమన్నారు.

### హిడ్మా సొంత గ్రామంలో ఇన్ఫార్మర్ పేరిట హత్య

మావోయిస్టు పార్టీ అగ్ర నేత మాడ్వి హిడ్మా సొంత గ్రామం పూవర్తి గ్రామ పటేల్ రామయ్యను శనివారం రాత్రి ఘోరంగా హత్య చేశారు. మావోయిస్టులే ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. దాదాపు 15 మంది పదునైన ఆయుధాలతో అతనిపై దాడి చేసి పొడిచి చంపారు. అతడు పోలీస్ ఇన్ఫార్మర్ అనే అనుమానంతోనే ఈ ఘాతుకానికి ఒడికట్టినట్లు తెలుస్తోంది.

### బస్తర్ డివిజన్‌పై కన్ను..

బస్తర్ డివిజన్‌లోని బస్తర్, బీజాపూర్, దంతెవాడ, కాంకేర్, కొండగావ్, నారాయణ్‌పూర్, సుక్మా జిల్లాల్లో మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేయగలిగితే దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేయొచ్చుననే లక్ష్యంతో భద్రతా బలగాలు ఇక్కడ ఆపరేషన్లు మొదలుపెట్టాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2023లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 90 శాతం ఈ డివిజన్‌లోనే జరిగాయి. బస్తర్‌పై 'గురి'పెట్టిన బలగాలు మావోయిస్టుల అణిచివేతలో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో భద్రతా దళాలు నిర్వహించిన ఆపరేషన్‌లో భారీ విజయాలు సాధించాయి. గుండెకోట గ్రామం వద్ద మావోల ప్రధాన కార్యదర్శి బసవరాజు, ఇంద్రావతి టైగర్ రిజర్వులో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ సహా పలువురిని నేల కూల్చాయి.

# సిక్కింలో హనీమూన్ జంట గల్లంతు

## 12 రోజులైనా లభించని ఆచూకీ



**సిక్కిం :** హనీమూన్‌కు వెళ్లిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన నవ దంపతులు సిక్కింలోని తీస్తా నదిలో గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన కౌశలేంద్ర ప్రతాప్‌సింగ్‌కు మే 5న అంకితా సింగ్ అనే యువతితో వివాహం అయ్యింది. అనంతరం మే 24న నూతన వధూవరులు హనీమూన్ కోసం సిక్కిం వెళ్లారు. మే 29న పర్యటనకు వెళ్లిన సమయంలో వారు ప్రయాణిస్తున్న కారుపై కొండ చరియలు విరిగిపడడంతో కారు అదుపుతప్పి తీస్తా నదిలో పడిపోయింది. ప్రమాద సమయంలో వీరితో పాటు కారులో మరో 9 మంది ఉన్నట్లు సమాచారం. 1,000 అడుగుల లోతున్న నదిలో కారు పడిపోవడంతో అందులో ఉన్నవారంతా గల్లంతయ్యారు. వారిలో ఇద్దరిని స్థానికులు రక్షించగా, డ్రైవర్ మృతి చెందారు. గల్లంతైన మరో ఎనిమిది మంది పర్యాటకుల ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, అటవీ శాఖ బృందాలు తీవ్రంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అయితే వాతావరణం అనుకూలించనందున సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. తప్పిపోయిన ఇతర పర్యాటకులలో నలుగురు ఒడిశాకు చెందినవారు కాగా, ఇద్దరు త్రిపురకు చెందినవారని తెలిపారు. కౌశలేంద్ర ప్రతాప్ సింగ్ తండ్రి షేర్ బహదూర్ సింగ్ మాట్లాడుతూ.. 12 రోజులైనా ఇంకా తన కుమారుడు, కోడలి ఆచూకీ లభించలేదని కన్నీరుమున్నీరయ్యారు. గాలింపును వేగవంతం చేయాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సిక్కిం సీఎంను అభ్యర్థించాలని విజ్ఞప్తి చేశారు.

# రగులుతున్న లాస్ ఏంజెలెస్..

## రణరంగంలా వీధులు..

**న్యూయార్క్ :** అమెరికాలోని అందాల నగరం లాస్ ఏంజెలెస్ వలసదారుల ఆందోళనలు.. దాడులతో రణరంగంలా మారింది. సిటీలోని వాణిజ్య ప్రాంతమైన డౌన్‌టౌన్‌లో ఎవరూ గుమికూడ వద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ భద్రతా దళాలు ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో ఓ రిపోర్టర్‌కు రబ్బరు తూటా తగిలింది. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) విభాగానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న 2,000 మంది ఆందోళనకారులు డౌన్‌టౌన్‌లోని ప్రధాన హైవేను తమ అధీనంలోకి తీసుకొన్నారు. ఇక్కడ సెల్ఫ్‌డ్రైవింగ్ కార్లకు వారు నిప్పు పెట్టారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో 101 ఫ్రీవేను ఆందోళనకారులు అడ్డుకొన్నారు. దీంతో అధికారులు ఆ మార్గాన్ని మూసేశారు. ఆందోళనకారులు పోలీసులపై రకరకాల వస్తువులు విసిరి దాడికి యత్నించారు. చాలా పోలీసు వాహనాలు తగలపెట్టారు. పసిఫిక్ సముద్రం పక్క నుంచి ఈ మార్గం దాదాపు 1500 మైళ్లు ప్రయాణిస్తుంది.

### ట్రంప్ చర్యలకు మస్క్ మద్దతు..!

గత కొన్నాళ్లుగా ట్రంప్‌నకు బద్ధవిరోధిలా ప్రవర్తిస్తున్న మస్క్.. తాజాగా లాస్ ఏంజెలెస్ నేషనల్ గార్డ్‌లను రంగంలోకి దింపాలనే ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించడం విశేషం. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టాడు. కాలిఫోర్నియా గవర్నర్, లాస్ ఏంజెలెస్ మేయర్‌లు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ట్రంప్ చేసిన పోస్టు స్క్రీన్ షాట్‌ను షేర్ చేశాడు. దీంతోపాటు జేడీ వాన్స్ పోస్టులను కూడా రీపోస్టు చేశాడు. లాస్ ఏంజెలెస్‌లో మాస్కుల్లో ఉన్న ఆందోళనకారులను అరెస్టు చేయాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జరిగిన ఆందోళనల్లో మాస్కుల వినియోగాన్ని ఆయన నిషేధించారు.

### రాజకీయ దుమారం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లాస్ ఏంజెలెస్ స్థానిక నాయకత్వం మధ్య ఘర్షణ కూడా పెరుగుతోంది. తాజాగా ఆ నగర మేయర్ కరెన్ బాస్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళనలు జరగాలన్నారు. ఇక ట్రంప్ వ్యవహార శైలిని తప్పుపట్టారు. "లాస్ ఏజెంలెస్‌లోని పరిస్థితిని రెచ్చగొట్టింది పాలకవర్గమే. పని ప్రాంగణాలు వంటి వాటిపై దాడులు నిర్వహించి తల్లిదండ్రులు, పిల్లలను వేధిస్తే.. సాయుధ బలగాలతో వీధుల్లో కవాతు చేయించి.. మీరు ప్రజల్లో భయం, ఆందోళన సృష్టిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ నగరంలో ఆందోళనలను అణిచివేయాలని 2,000 మంది నేషనల్ గార్డ్స్‌ను ట్రంప్ కార్యవర్గం సిద్ధం చేసింది. ఇప్పటికే 300 మంది ఆ నగరానికి చేరుకొన్నారు. "ఒకప్పుడు అమెరికాలో గొప్ప నగరమైన లాస్ ఏంజెలెస్‌ను అక్రమ వలసదారులు క్రిమినల్స్ ఆక్రమించుకొన్నారు" అని సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు.

Printed published and owned by LANDE BHASKER .Printed at Karuna Sree publicationsH.no .3-135/24,Chityal Village,Tadwai Mandal, Telangana. And published from H.no.3-135/24, Chityal Village, Tadwai Mandal,Telangana.Editor - LANDE BHASKER.RNI TELTEL/2024/89275 . PHONE NO: 9542559271 E-MAIL ID: bhaskerlande20@gmail.com